

కిలో బియ్యం బదులుగా కిలో రాగులు

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఆగస్టు నెల నుంచి ఒక కిలో బియ్యం బదులుగా ఒక కిలో రాగులు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజలకు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రాగులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తారు. రాగులు కావాలనుకునే రేషన్ కార్డుదారులు సంబంధిత డీలర్‌కు ముందుగానే తెలియజేయాల'ని జేసీ సూచించారు.

పలాస అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ వ్యూ

● భవిష్యత్ అవసరాల దృష్ట్యా మునిసిపాలిటీలో మార్పులు
● కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలు చేరిక
● గెజిట్ నోటిఫికేషన్‌పై అభిప్రాయాల స్వీకరణ

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని సుడా (శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ) పరిధిలోకి తీసుకువచ్చి 2046 సంవత్సరం వరకూ అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయనుంది. దీనికి సంబంధించి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లోగా ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పేందుకు గడువు విధించారు. అనంతరం మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం తర్వాత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గను పూర్తిస్థాయిలో పట్టణీకరించేందుకు ఈ మాస్టర్‌ప్లాన్ ఎంతో దోహదం చేస్తుంది.



పలాస-కాశీబుగ్గ ముఖచిత్రం

● ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ పరిధిలో మొత్తం 25 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలను చేర్పించారు. అందులో కైజోల, సున్నాడ, శాసనం, రాజగోపాలపురం, కంబిరిగాం, ఈదురాపల్లి, కేదారిపురం, సొగిడియా, పండాశాసనం, బ్రాహ్మణతర్లా, అనంతగిరి, కిష్టుపురం, లక్ష్మీపురం, గరుడఖండి, బట్టుపాడు, మహదేవపురం, గోపాలపురం, నగరంపల్లి, పెద్దబడాం, రాజాం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ కింద వస్తాయి. ఇప్పటికే దీనికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి సుడా పట్టణాభివృద్ధిలోకి తీసుకురానున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా 20, 40 అడుగుల వెడల్పుతో రహదారులు నిర్మాణం జరగనున్నాయి. మొత్తం ఈ ప్రాంతాలన్నీ జోన్లవారిగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. రెసిడెన్సియల్ కాంప్లెక్స్‌లు, పారిశ్రామికవాడలు (మిగతా 6వ పేజీలో..)

అభివృద్ధి అవసరం..



భవిష్యత్ అవసరాలకు పలాస-కాశీబుగ్గ అభివృద్ధి చేయడం ఎంతో అవసరం ఉంది. శరవేగంతో పట్టణీకరణ జరుగుతున్న సమయంలో మాస్టర్‌ప్లాన్ అమలైతే విశాలమైన రహదారులు, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి జరుగుతుంది. దీనికి సంబంధించి ముసాయిదా ఇప్పటికే విడుదల చేశాం. ప్రజల అభ్యంతరాలు స్వీకరించి దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తాం.

-రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

కూపన్ విధానంలో ఎరువుల పంపిణీ

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ఇన్‌చార్జిలు పంపిణీ చేస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో రైతు సేవా కేంద్రాలకు శనివారం 600 టన్నుల యూరియాను సరఫరా చేశాం. ప్రతీ రైతుసేవా కేంద్రానికి మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్ల సంతకాలతో కూడిన కూపన్లు ఇవ్వనున్నాం. కూపన్ పొందిన రైతులు నిర్దేశిత సమయంలో వెళ్లి ఎరువును తీసుకోవాలి. రద్దీని నియంత్రించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నామ'ని తెలిపారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు: జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాల్లో ఆదివారం నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. ప్రత్యేక అవసరాలు గల అభ్యర్థులకు 20 నిమిషాల అదనపు సమయం, స్క్రైబ్ సదుపాయం కల్పించాలి. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ప్రాథమిక చికిత్స, పోలీసు బందోబస్తు తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థులను ఉదయం పరీక్షలకు 8-30 నుంచి 9-15 వరకు, మధ్యాహ్నం పరీక్షలకు 1.30 నుంచి 2.15వరకు అనుమతించాలి. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అభ్యర్థులు, ఇన్విజిలేటర్లకు అనుమతి లేద'ని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు భోగేశ్వరి, పి.పద్మప్రియ, ఇతర శాఖల ప్రతినిధులు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

అమ్మో.. పోస్టల్!

● కొందరు సిబ్బంది తీరుతో చిన్నబోతున్న తపాలాశాఖ
● ఇచ్ఛాపురంలో రూ.2.86 కోట్ల కుంభకోణంపై చర్చ
● కొనసాగుతున్న విచారణ

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని పోస్టాఫీసులో రూ.2.86 కోట్ల కుంభకోణం శుక్రవారం వెలుగులోకి రావడంతో.. తపాలాశాఖపై ఖాతాదారుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఆర్థిక పొదుపు సేవలకు నమ్మకమైన తపాలాశాఖలో కూడా అక్రమాలు చోటుచేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. పోస్టల్ శాఖలో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండడం ఖాతాదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇచ్ఛాపురంలో పోస్టల్ సిబ్బంది పాత్రతో ఈ స్కామ్ జరిగిందని అధికారుల విచారణలో తేలగా ఇప్పటికే ఐదుగురిని సస్పెండ్ చేశారు. దీనిపై మరింత విచారణ చేపడుతున్నారు. శనివారం కూడా సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, శ్రీకాకుళం పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ ఇచ్ఛాపురంలో పోస్టల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఖాతాదారుల వద్ద ఉన్న కిసాన్ వికాస్ పత్రాలు (కేవీపీ) బాండ్లను పరిశీలించారు. కొంతమంది ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో వారి నుంచి క్లయిమ్స్ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా చాలామంది ఖాతాదారులు పోస్టల్ కార్యాలయానికి చేరుకుని.. లబోదిబోమంటున్నారు. పోస్టల్‌లో సైతం డబ్బులు దాచుకోవడానికి భయపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

● ఇచ్ఛాపురానికి చెందిన ఓ వ్యక్తి 2016లో తన పిల్లల పేర్లు మీద రూ.11లక్షలు కేవీపీ బాండ్లపై డిపాజిట్ చేశారు. వారి ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసినట్టు ఉంది. దీంతో ఆ వ్యక్తి ఆందోళన చెందాడు.

● ఖజానా వీధికి చెందిన బి.మహాలక్ష్మి, బి.డిల్లమ్మ గతేడాది కేవీపీ బాండ్లపై రూ.3లక్షలు డిపాజిట్ చేశారు. శనివారం వారి ఖాతాను పరిశీలించగా.. డబ్బులు డ్రా చేసినట్టు ఉండడంతో వారు లబోదిబోమన్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

● ఇలా చాలామంది ఖాతాదారులు పోస్టల్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ ఖాతాల్లో డబ్బులు ఉన్నాయో లేదోనని తనిఖీ చేయిస్తున్నారు. కొంతమంది ఖాతాలు ఖాళీగా కనిపిస్తుండడంతో కలవరపడుతున్నారు. కూలి చేసుకుని.. పిల్లల భవిష్యత్, ఆర్థిక అవసరాల కోసం డబ్బులు దాచుకున్నామని, తమ డబ్బులు తమకు ఇప్పించేలా చూడాలని పోస్టల్ అధికారులను వేడుకుంటున్నారు. కాగా ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. ఈ కేసు సీబీఐకి అప్పగించామని, త్వరలోనే బాధ్యులందరికీ పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామన్నారు. ఖాతాదారులకు సకాలంలో ఆ డబ్బులు అందేలా చర్యలు చేపడతామన్నారు.



ఆవేదన చెందుతున్న మహాలక్ష్మి, ఢిల్లమ్మ



పోస్టల్ కార్యాలయంలో బాధితుల ఖాతాలను పరిశీలిస్తున్న అధికారులు

వారం కిందటే వచ్చి వెళ్లారు

● తెలంగాణ రాష్ట్రంలోని రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు దుర్మరణం
● స్వగ్రామం డోలలో విషాదఛాయలు



ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు (ఫైల్)



డోలలో శాంతారావు ఇంటివద్ద విషాదంలో బంధువులు

పోలాకి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రోడ్డుప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ, సీఎం స్పెషల్ సెక్యూరిటీ అధికారి(ఎస్.ఎస్.జీ) జల్లు శాంతారావు(56) మృతి చెందడంతో.. ఆయన స్వగ్రామం పోలాకి మండలం డోలలో విషాదఛాయలు అలుముకున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం స్టేజి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు డీఎస్పీలు దుర్మరణం చెందగా, మరో (మిగతా 6వ పేజీలో..)

● ఐదుగురి సీఎంల వద్ద విధులు..

ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు పోలాకి, వెదుళ్లవలస గ్రామ పాఠశాలల్లో విద్యనభ్యసించారు. పోలీస్ విభాగ పోటీ పరీక్షలు రాసి 1992లో ఉమ్మడి హైదరాబాద్ రాజధానిలో కానిస్టేబుల్‌గా తర్వాత సీఐగా పదోన్నతి పొందారు. అనంతరం రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు బదిలీ అయ్యారు. ఐదుగురు సీఎంల వద్ద సెక్యూరిటీ సీనియర్ గ్యాంగ్(ఎస్.ఎస్.జి) ఇంటెలిజెన్సీ సీనియర్ అధికారిగా(డీఎస్పీ స్థాయి) విధులు నిర్వర్తించారు. మంచి అధికారిగా వారి మన్ననలు పొందారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ వింగ్ విభాగంలో డీఎస్పీగా ఆయన పని చేస్తున్నారు.

● కుటుంబ నేపథ్యమిదీ..

డీఎస్పీ శాంతారావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు బాలగంగాధర్‌తిలక్, శ్రీరామ్ ఉన్నారు. శాంతారావు దంపతులు అమరావతిలో నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు తిలక్‌కు 2023లో వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్రీరామ్ ఉన్నత చదువు నిమిత్తం రెండేళ్ల కిందట థాయిలాండ్ వెళ్లాడు. శాంతారావు సోదరుడు జల్లు జగన్నాయకులు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. శాంతారావుకు డోలలో సొంతిల్లు ఉంది. అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవారని బంధువులు తెలిపారు.

దేహం ఇక్కడ.. ప్రాణం అక్కడ!

● తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు ● ఉపాధి కోసం వెళ్లక తప్పని వైనం
● ఫోన్‌లో పలకరింపులకే అధికశాతం పరిమితం ● నేడు 'పేరెంట్స్ డే'

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

● నరసన్నపేటలో రాజుల చెరువు, కూరగాయల మార్కెట్ అభివృద్ధి
● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో



షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీజీ ప్రతాప్

అగ్నిప్రమాదాల నివారణకు బ్రీతింగ్ బాల్కనీలు

● షాపింగ్ మాల్స్‌లో ఏర్పాటు చేసుకోవాలి ● శ్రీకాకుళం నుంచే శ్రీకారం
● విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ 6లో

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ప్రతిరోజూ గ్రామాలను సందర్శించాలి: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

టీడీవలసలో ప్రత్యేక వైద్య బృందం పర్యటన

7లో

నకిలీ పట్టాలతో.. ప్రభుత్వ భూమి హాంఫట్

● సైలాడ కొండ ప్రాంతం ఆక్రమణకు యత్నం
● పరిసరాల్లోని గ్రామస్థుల ఆందోళన
● ఎమ్మెల్యే, అధికారులకు ఫిర్యాదు



ఆక్రమణకు గురైన సైలాడ కొండ ప్రాంతం

ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం మారినా.. భూ దందాలు మాత్రం ఆగడం లేదు. వైసీపీ పాలనలో కొండలు, గుట్టలు, కాలువలు, ప్రభుత్వ భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయి. అప్పట్లో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో భూ అనుమతులు సృష్టించిన వ్యక్తులు.. ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఆమదాలవలస మండలం చిట్టివలస ప్రాంతంలోని సైలాడ రెవెన్యూ గ్రామంలో కొండను ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రభుత్వం తనకు డీ పట్టా మంజూరు చేసిందని స్థానికులను నమ్మిస్తూ.. సైలాడ కొండను ఆక్రమించాలని భావించాడు. దీంతో పరిసర గామాలైన గాజుల కొల్లివలస, చిట్టివలస, సైలాడకు చెందిన ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్రమణ ల వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామాలకు చెందిన సవర చిన్నా రావు, బంటుపల్లి కూర్మారావు, నూలు లక్ష్మణ, భోగి నాగరాజు, లబ్బ రమణ, పి.సూరి, ఎర్రంనాయుడు, శ్రీను తది తరులు ఆమదాలవలస రెవెన్యూ కార్యాలయంలో కూడా గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రెవెన్యూ సర్వే నెంబర్ 183 కలిగిన సైలా డ కొండ ప్రాంతంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు 294, 295-2, 296-1, 296-3 కలిగిన తప్పుడు సర్వే నెంబర్లతో గతంలో డీ పట్టాలు మంజూరు చేసినట్టు తెలిసింది. తప్పుడు సర్వే నెంబర్లు, నకిలీ పట్టాతో ఓ అక్రమార్కుడు సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పనులు ప్రారంభించాడు. సైలాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఎఫ్ ఎంబీలు 292, 293 వరకు మాత్రమే ఉండగా, 296 సర్వే నెంబర్ ఎక్కడ నుంచి పుట్టుకొచ్చిం దని ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి నకిలీ పట్టాలను రద్దు చేయడంతోపాటు ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఆ ప్రాంతమంతా టిపో గ్రాఫికల్ (మిగతా 6వ పేజీలో..)

దేహం ఇక్కడ.. ప్రాణం అక్కడ!

- తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు
- ఉపాధి కోసం వెళ్లక తప్పని వైనం
- ఫోన్‌లో పలకరింపులకే అధికశాతం పరిమితం
- బాధ్యతలను మరచిపోని వారు ఎందరో

నేడు 'పేరెంట్స్ డే'



ఏ తల్లిదండ్రులైనా పిల్లలను ప్రాణపదంగా ప్రేమిస్తారు. కాలక్రమంలో ఉపాధి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా తల్లిదండ్రులకు దూరంగా పిల్లలు ఉండాల్సి వస్తోంది. కొందరైతే కుటుంబ పోషణ కోసం తప్పనిసరిగా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. నిత్యం పలుకరించే కుటుంబ అవసరాలు... వేధించే ఆర్థిక సమస్యలు... కనుచూపుమేర కనిపించని ఉపాధి అవకాశాలు... మరికొందరిని విదేశాల బాట పట్టిస్తుంటాయి. అక్కడ ఉద్యోగావకాశాలు బాగున్నా.. ఆర్థిక అవసరాలను దాటగలుగుతున్నా... కన్నబిడ్డలు కళ్ల ముందు లేరనే దిగులు తల్లిదండ్రులను వెంటాడుతోంది. కొందరు బిడ్డలు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నా... చేతి నిండా డబ్బులు ఉంటున్నా... ఇక్కడి వారి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పొరుగు వారి సాయానికై వేచి చూడాల్సిన పరిస్థితి. ఎంతదూరంలో ఉన్నా..తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్న వారు కొందరైతే... మరచిపోతున్న వారు కొందరు. ఇక బిడ్డలు దూరంగా ఉంటున్నారని నిరాశ చెందుతున్న తల్లిదండ్రులు కొందరైతే... ఎంతదూరంలో ఉన్నా... అభిమానాన్ని చాటుకోవడం కష్టంగా కాదని ఆశావాద దృక్పథంతో ముందుకెళుతున్న తల్లిదండ్రులు కొందరు. ఆదివారం 'పేరెంట్స్ డే' సందర్భంగా అలాంటి కొందరు తల్లిదండ్రుల గురించి తెలుసుకుందాం.

బిడ్డలు దూరంగా.. ఆవేదన తోడుగా..

పలాస, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన ఓ వ్యక్తి 15 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహాలయ్యాయి. పిల్లలు దేశంలోని వేర్వేరు ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎవరు ఆసరాగా ఉంటారన్నది నిర్ధారించకపోవడం... ఉన్న ఊరిపై మమకారంతో ఆ దంపతులు ఇంటికే పరిమితమయ్యారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరికీ వయసు మీద పడడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారి పరిస్థితి దయనీయంగా మారింది. పింఛను రూపంలో చేతిలో డబ్బులు ఉన్నా... రక్తసంబంధీకులు ఎవరూ అందుబాటులో లేకపోవడం వారిని తీవ్రంగా కలచివేస్తోంది. చివరకు ఆసుపత్రికి వెళ్లాలన్నా... బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా చేద్దామన్నా పొరుగు వారిపై ఆధారపడక తప్పని పరిస్థితి. కుమారులు, కుమార్తెలు ఉన్నా వారు ఒంటరైపోయారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే.. మరో వృద్ధ దంపతుల పరిస్థితి మరింత హృదయవిదాకరంగా మారింది. పొరుగువారి ఓదార్పే వారికి శ్రీరామరక్షగా నిలుస్తోంది. రైల్వేశాఖలో పనిచేసి విరమణ చేసిన ఆయనకు మొత్తం ఐదుగురు సంతానం. అందులో ఇద్దరు మృతి చెందగా... మరో ఇద్దరు విదేశాల్లో భార్యాబిడ్డలతో స్థిరపడ్డారు. నిత్యం తల్లిదండ్రులకు యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం తప్ప స్వయంగా సాయం అందించే పరిస్థితి లేదు. దీంతో నిత్యం ఒంటరిగా ఆ వృద్ధుడు విలపించడం తప్ప..ఏమీ చేయలేకపోతున్నాడు. వారి కుమారులు తల్లిదండ్రులను ఓదార్చడం తప్ప తమతో తీసుకెళ్లలేకపోవడం గమనార్హం.

దక్షిణాఫ్రికాలో పిల్లలు... ఇక్కడ తల్లిదండ్రులు

సరుబుజ్జిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్నేహితుల సాయంతోనో... తెలిసిన వారి తోడుగానో.. ఉపాధిని వెదుక్కుటూ దేశం కాని దేశానికి వెళ్లిపోయారా యువకులు. కొందరు భార్య, చిన్న పిల్లలను.. మరి కొందరు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇలా.. కుటుంబాలను వదిలిపెట్టి... ఉపాధి కోసం వెళ్లారు. రకరకాల కారణాలతో వారు రెండు, మూడేళ్లు అక్కడే ఉండాల్సి రావడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. ఇదీ సరుబుజ్జిలి, నందికొండ తదితర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకుల పరిస్థితి. వీరిలో కొందరు దక్షిణాఫ్రికాలో లిక్కర్ పరిశ్రమలలో ఉపాధి పొందుతున్నారు. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన మెట్ట నాగభూషణం, కొమ్మనాపల్లి రాజేష్, ఎండ వరహాలనాయుడు, రాకోటి నరేష్, గరికిపాటి రాజు, ఇలపండ పృథ్వీరాజ్, పేడాడ వంశీ, నందికొండ గ్రామానికి చందిన డి.ఎన్. శ్రీను, బెండి కోటేశ్వరరావు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నారు. వీరిలో కొంతమంది డిగ్రీ పూర్తి చేయగా.. మరికొంతమంది మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పి... కుటుంబ పోషణ నిమిత్తం విదేశాల బాట పట్టారు. పండగలు, ఇతర శుభకార్యాలు కుటుంబ సభ్యులందరూ కలిసే చేసుకొనే అవకాశం లేకపోవడంతో అక్కడ వారు... ఇక్కడ వృద్ధులైన తల్లిదండ్రులు బాధ పడుతున్నారు. రాజేష్ తండ్రి మరణించారు. తల్లి మాత్రమే ఉంది. ఆమె ఇటీవల తీ వ్ర అనారోగ్యానికి గురైంది. కుమారుడికి సమాచారం తెలిసినప్పటికీ ఉపాధి అవకాశాలు కోసం చేసుకున్న అగ్రిమెంట్‌లో భాగంగా ఇక్కడికి రాలేని పరిస్థితి. తల్లి, కుమారుల మధ్య కేవలం ఫోన్‌లోనే పలకరించుకునే పరిస్థితి. నాగభూషణం తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. అయినా కుమారుడిది రాలేని పరిస్థితి. పెండ్లి సంబంధం కుదుర్చుకొని... రెండేళ్లలో వచ్చి వివాహం చేసుకుంటానని శ్రీను దక్షిణాఫ్రికాకు వెళ్లాడు. అనివార్య కారణాల వల్ల మరో ఏడాది అక్కడ ఉండాల్సి రావడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. వీరే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన మరికొంతమంది నిరుద్యోగ యువకులు కూడా దక్షిణా ఫ్రికాలో ఇదే విధంగా ఉపాధి కోసం వెళ్లారు. వారి కుటుంబాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

ప్రేమగా చూసుకుంటున్నారు..

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురానికి చెందిన ఆశి ప్రకాశరెడ్డి అనే ఉపాధ్యాయుడు ఈ ప్రాంతంలో అందరికీ సుపరిచితులు. ఆయన భార్య కాంతమ్మ గృహిణి. వీరికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రమేష్ మృతిచెందారు. ప్రకాశరెడ్డి 2008లో కన్నుమూశారు. చిన్న కుమారులు సురేష్, సతీష్ ఇద్దరూ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తమతో పాటు తల్లి కాంతమ్మను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడి వాతావరణం నచ్చక ఆమె ఇచ్ఛాపురంలోనే ఉంటున్నారు. దీంతో తల్లి కోసం కుమారులు కేర్ టేకర్స్‌ను నియమించారు. కంటికి రెప్పలా చూసుకుంటూ వస్తున్నారు. ఏటా సంక్రాంతికి ఇద్దరు పిల్లలూ కుటుంబాలతో వచ్చి గడుపుతుంటారు. పిల్లలు తనకు ఎటువంటి లోటు చేయరని.. తమ సమ్మతితోనే వారు విదేశాలకు వెళ్లినట్టు కాంతమ్మ చెబుతుంటారు. తల్లి కోసం పట్టణ పరిధి కార్జి వీధిలో పెద్ద భవనాన్ని నిర్మించారు. అక్కడే ఆమె ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అభిమానానికి దూరం ఉండదు..



అంగూరు గణపతిరావు

పాతపట్నం, జులై 26(ఆంధ్రజ్యోతి): దూరం అనేది మనుషుల మధ్య అభిమానాన్ని చాటుకోవడానికి అడ్డురాదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంగూరు గణపతిరావు అన్నారు. స్థానిక నరసింహనగర్‌కు చెందిన గణపతిరావు భార్య లలిత కుమారి గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు ప్రవీణ్ కుమార్, కోడలు కరిష్మా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కుమార్తెలు కాంచన డెంటిస్టుగా, సుజన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కుటుంబాలతో బెంగళూరులో ఉంటున్నారు. పిల్లలు దూరంగా ఉన్న విషయమై గణపతిరావు మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవసరమైన సమయాన్ని కేటాయిస్తూ పిల్లలుల తమను ఆనందంగానే ఉంచు తున్నారని తెలిపారు. తల్లి లలితకుమారి మాట్లాడుతూ అప్పుడప్పుడూ దూరంగా ఉన్నారనే చిన్న దిగులు కలుగుతుంది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఆ అసంతృప్తిని అధిగమించగలుగుతున్నామని తెలిపారు. దూరంగా ఉన్నారనే భయంగానీ.. దిగులు గానీ లేదనే చెబుతున్నారు.



పలాస: చెరువును తలపిస్తున్న తాళభద్ర రోడ్డు

చెరువులు కాదు.. రోడ్లే

పలాస/మెళియాపుట్టి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అడుగడుగునా గోతులతో ఇవి నిండిపోయాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ గోతుల్లో నీరు చేరి.. చెరువుల్లా మారిపోయాయి. దీంతో ప్రమాదాల సంఖ్య మరింత పెరుగుతోంది. కొన్ని రోడ్ల పనులు మధ్యలో నిలిచిపోవడం... కొన్ని రహదారుల పనులు చేపట్టకపోవడంతో దారుణంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి... ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మెళియాపుట్టి: భావనాపురం రహదారి ఇలా...

అగ్ని ప్రమాదాల నివారణకు బ్రీతింగ్ బాల్కనీలు

- షాపింగ్ మాల్స్‌లో ఏర్పాటు చేసుకోవాలి
- శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడుతున్నాం
- ఇది దేశవ్యాప్తంగా ప్రచారం కావాలి
- విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'దేశంలోని షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లు నేడు బహుళ అంతస్థుల కాంక్రీట్ బాక్సులుగా ఉంటున్నాయి. ఇటువంటి మాల్స్‌లో అగ్నిప్రమాదం సంభవిస్తే తీవ్ర ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. దీనికి నివారణగా షాపింగ్ మాల్స్‌లో బ్రీతింగ్ బాల్కనీలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.'.. అని విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ (ఐపీఎస్) పేర్కొన్నారు. నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ ఏడాది జనవరి 25న శ్రీకాకుళం నగరంలోని ఓ పెద్ద షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మాల్ లోపలకు వెళ్లడానికే ఆరు గంటల సమయం పట్టింది. మంటలను అదుపు చేయడానికి మరో ఆరు గంటల సమయం పట్టింది. అదృష్టవశాత్తు మాల్ పని గంటల సమయంలో ఈ ప్రమాదం జరగకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ, ఇది అందరికీ ఒక గుణపాఠం లాంటిది. దీనికి సరైన పరిష్కారం కోసం చాలామంది నిపుణులతో మాట్లాడాం. షాపింగ్‌మాల్‌సలో ప్రతి అంతస్థుకు ఒక బ్రీతింగ్ బాల్కనీ నిర్మించడం ద్వారా ప్రమాదం జరిగినా ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా నివారించవచ్చు. దీనికి శ్రీకాకుళం నగరం నుంచే శ్రీకారం చుడుతున్నాం. అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్‌మాల్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రతి అంతస్థుకు బ్రీతింగ్ బాల్కనీలు నిర్మించారు. చాలా సులువైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న, ఎటువంటి మెయింటెనెన్స్ అవసరం లేని ఏర్పాటు ఇది. దేశంలోని అన్ని షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లలో బ్రీతింగ్ బాల్కనీలు నిర్మించాలి. ఇటీవల ఇరాక్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించి 82 మంది ప్రాణాలు కోల్పోయారు. మన దేశంలో ఇటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కొత్తగా మాల్స్‌కు సంబంధించి, భవనాల అనుమతుల్లో మార్పులు చేశాం. ముందుగా స్మోక్ టెస్ట్ నిర్వహించి, ఆ తరువాతనే అనుమతులు జారీ చేస్తాం.' అని అన్నారు. తొలుత మాల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగితే ఎలా ప్రాణనష్టం జరగకుండా నివారించాలి అన్న విషయంపై షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ అధికారి నిరంజన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, సహాయ అధికారి కె.శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.



షాపింగ్ మాల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రతాప్

మూలపేట పోర్టు పరిశీలన..

సంతబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టును రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శనివారం పరిశీలించారు. సిబ్బందిని అడిగి..వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, పోర్ట్ జీఎం శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

- పేటలో రాజుల చెరువు, కూరగాయల మార్కెట్ అభివృద్ధి
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తదితరులు

నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించే బాధ్యతను పంచాయతీ, రెవెన్యూ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం స్థానిక ఎమ్పీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నియోజవర్గ స్థాయి సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నరసన్నపేట పట్టణంలోని రాజుల చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి కృషి చేయాలని, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, పార్కు నిర్మించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. చెరువులోకి మురుగు కాలువల నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులోని ఆక్రమణలను తొలగించాలని, స్నానాల ఘాట్‌లను పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి జలవనరుల శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు కలిసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మినీ స్టేడియానికి సంబంధించి ఉడెన్ ఫ్లోర్, లైటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. శాప్ చైర్మన్‌తో మాట్లాడి... పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ అండ్‌బీ భవనం వద్ద పార్కు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కామేశ్వరిపేట, లుకలాం, బొంతు ఎత్తిపోతల పనులు, సాగునీరు- తాగునీరు పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్, ట్రైనీ కలెక్టర్ డి. పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా ఉద్యానవనశాఖ ఏడీ వరప్రసాద్, టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, డీసీహెచ్‌వో కళ్యాణ్‌బాబు, ప్రత్యేక అధికారి అనురాధ, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కె.వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన..

సమీక్ష అనంతరం నరసన్నపేట వంద పడకల ఆసుపత్రిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో అదనపు భవనాల నిర్మాణ పనులు నత్తనడకగా సాగడంపై ఆరా తీశారు. అలాగే ఓపీ, వార్డులను పరిశీలించారు. ఆర్థో, ఆప్తమాలజీ శస్త్రచికిత్సలు జరగకపోవడానికి గల కారణమేంటని డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించాలని, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పలాస అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

(ఐదో పేజీ తరువాయి)

కమర్షియల్ ప్రాంతాలు, అగ్రికల్చర్ జోన్లు, విద్యు త్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, పెట్రోలు బంకులు మొ త్తం అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. పథకమంతా జాతీయరహదారికి అనుసంధానం చేసి గ్రామాలు, పట్టణాభివృద్ధి జరిపేందుకు పొంది పరిచారు. ఇప్పటికే పలాస-కాశీబుగ్గ.. జీడి పారిశ్రా మికవాడగా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన విషయం విధితమే. మన జీడిపప్పుకు జాతీయ స్థాయి అవార్డు కూడా లభించింది. ఈ నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్ భవిష్యత్ అవసరాలకు అమలైతే జిల్లా కేంద్రం తరువాత ఆ స్థాయిలో జంట పట్టణాలు సుందరీకరణకు అవకాశం ఉంటుందని జంట పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ పట్టాలతో.. ప్రభుత్వ భూమి హాంఫట్

(ఐదో పేజీ తరువాయి)

సర్వే చేసి ఇప్పటివరకు ఉన్న సర్వే నెంబర్లు ప్ర భుత్వ భూములను గుర్తించాలన్నారు. నకిలీ పట్టా దారుడుకు వత్తాసు పలుకుతూ.. అతని పట్టాలో ఉన్న సర్వే నెంబర్లు మార్పిడి చేస్తే కోర్టును ఆశ్ర యిస్తామన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- ఈ విషయమై తహసీల్దార్ ఎస్.రాంబాబు వద్ద ప్రస్తావించగా.. 'గతంలో సైలాడ కొండ ప్రాంతంలో పట్టాలు అందజేశాం. ప్రస్తుతం ఆ ప్రాంత భూములు ఆక్రమణపై కొంతమంది ఫిర్యాదు చేశా రు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇరు వర్గాల ఆరోపణలపై విచారణ చేస్తాం. ఆక్రమణ నిజమైతే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

వారం కిందటే వచ్చి వెళ్లారు

(ఐదో పేజీ తరువాయి)

ఏఎస్పీ, కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒక డీఎస్పీ శాంతారావుది పోలాకి మండలం డోల గ్రామం. శాంతారావు దుర్మరణ వార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. శాంతారావు వారం రోజుల కిందటే గ్రామానికి వచ్చి.. అందరితో సరదాగా గడిపారని, ఇంతలోనే మృతి చెందడం బాధాకరమని ఆయన బంధువు జే.శివరాం, గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. శాంతారావు మృతదేహం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. నరసన్నపేట సీఐ మరడాన శ్రీనివాసరావు తన సిబ్బందితో డోల గ్రామానికి వెళ్లి.. మృతుడి బంధువులను పరామర్శించారు. మృతదేహాన్ని త్వరగా తెచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని అధైర్యపడవద్దని తెలిపారు. అలాగే శాంతారావు దుర్మరణంపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మాజీ డీసీసీబీ చైర్మన్ డోల జగన్, కరిమిరాజు, ఎం.వి.నాయుడు, ఎస్ఐ రంజిత్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైసీపీ పాలన అవినీతిమయం: ఎమ్మెల్యే అశోక్


కరపత్రాలిచ్చి అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన అంతా అవినీతి మయమేనని, ఇసుక నుంచి మద్యం వరకు దోచుకున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. లక్కవరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పాలనను ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ చంద్రమోహన్, రాష్ట్రకార్యదర్శి మద్దు కుమార్, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, జీకే నాయుడు, సనపల శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే శంకర్


గొంటిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు ప్రతి పల్లె అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గొంటి, బలరాంపురం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీలో 'గొండు'

శ్రీకాకుళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టసభలకు పలు కమిటీలను నియమించింది. ఇందులో భాగంగా వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, గొండు శంకర్, చింతమనేని ప్రభాకర్, నందమూరి బాలకృష్ణ, పులిపర్తి వెంకటమణిప్రసాద్, బుడ్డా రాజశేఖరరెడ్డి, వేగేశన నరేంద్రవర్మ రాజు, ఎమ్మెల్సీలు చిన్న గోవిందరెడ్డి దేవసాని, బి.తిరుమలనాయుడు, పాలవలస విక్రాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బీజేపీని బలోపేతం చేయాలి

పాత శ్రీకాకుళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్ కమిటీల నుంచి బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. పార్టీ జిల్లా నూతన పదాధికారుల తొలి సమావేశం శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి విజయానంద్, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, కోర్ కమిటి సభ్యులు పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబు, బడే తాతారావు, శవ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌదరి అవినాష్ పుట్టినరోజు వేడుకలు


చౌదరి అవినాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ పుట్టినరోజు వేడుకలు ఎస్ఎంపురంలోని ఆయన స్వగృహంలో శనివారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అవినాష్ కేక్ కట్‌చేశారు. టీడీపీ నేతలు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, అల్లుపల్లి రాంబాబు, గూరు జగపతిబాబు, గొంటి నర్సింగరావు, సంపతిరావు గణపతిరావు, గాడు రామారావు, డీసీఎంఎస్‌తో పలు శాఖల ఉద్యోగులు, కూటమి నేతలు అవినాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రిఅచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ అవినాష్‌కు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈసీ సభ్యుడిగా సుధాకర్




ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఆమదాలవలసకి చెందిన డాక్టర్ చాపర సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన ప్రస్తుతం ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. తనపై నమ్మకం ఉంచి మెంబర్‌గా నియమించేందుకు కృషి చేసిన మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వైద్యరంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

సోంపేట, రూరల్ 26(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. పైడిగాం గిరిజన గ్రామంలో వంద న వికాస్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. మాల గోవిందపురం పంచాయతీ బకుడా, కొత్త బాతుపురం, పైడిగాం గ్రామాల్లో అవగాహన కల్పించారు. సీసీ శ్రీనివారావు, వీవోఏ జ్యోతిరాజు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో తిరుమల చైతన్య

కవిటి, జూలై 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జడ్పీ పాఠశాలలను శనివారం డీఈవో తిరుమల చైతన్య ఆకస్మికంగా సందర్శించారు. బల్లి పుట్టుగ, కళింగ పట్నం గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. కళింగ పట్నంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ ఉపా ధ్యాయులు ఉన్నారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతిరోజూ గ్రామాలను సందర్శించాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లు, విజిబుల్ పోలీసింగ్, అవెర్నెస్ ప్రోగ్రాం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జి షీట్‌లను కోర్టులో దాఖలు చేయాల న్నారు. గంజాయి, మద్యం, సారా, పశువుల రవాణాపై నిఘా పెట్టి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. పోలీస్ అధికారులు ప్రతిరోజూ గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి నారీశక్తి సంకల్పం పేరిట మహిళా భద్రతా అంశానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి అవగాహన కలిగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వాదించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, వివిధ కేసులను చేధించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐలు ఇమ్మా న్యుయేల్ రాజు, అవతారం, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలిచ్చి అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎంవీ అప్పారావు, డి.లక్ష్మణరావు, ప్రసాద రావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టెక్కలి డీఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా టెక్కలికి వచ్చిన డి.లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించి శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెక్కలి సబ్ డివిజన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, మహి ళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీకి ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

చర్చించకుండా అజెండాలో ప్రతిపాదిస్తే ఎలా?

- రూ.55 లక్షల పనులపై కౌన్సిలర్ల అభ్యంతరం
- అవసరమైన ప్రాంతాల్లో వీధిలైట్లు వేయాలి


సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా ఏయే వార్డుల్లో ఏ పనులు చేపట్టాలో సమావేశంలో చర్చించి తదుపరి అజెండాలో పొందుపరచాలని, అలా కాకుండా రూ.55 లక్షల పనులను ఎలా ప్రతిపాదించారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా 16 పనులను రూ.55 లక్షలతో చేపట్టేందుకు అజెండాలో ఎలా పెట్టారని అధికారులను ప్రశ్నించారు. కౌన్సిలర్లతో చర్చిస్తే ఏ సమస్యలున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలో తెలుస్తాయని, అలా కాకుండా ఏకపక్షంగా పనులు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనికి చైర్‌పర్సన్ రాజలక్ష్మి స్పందిస్తూ.. ఇంకా అవసరమైన పనులకు మరలా నిధులు కేటాయించి పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అర్హత లేని కాంట్రాక్టర్లకు పనులు కేటాయించడంపై కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, పనులు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లకు అడ్డు చెప్పడం సరికాదని, అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కౌన్సిలర్లు లీలారాణి, బి.జగన్ కోరారు. మునిసిపాలిటీ పరిధిలో కార్యాలయం నుంచి మార్కెట్ జంక్షన్ వరకు మాత్రమే సెంటర్ లైటింగ్‌ను నిధులు కేటాయించడం కాదని, లైటింగ్ లేని పాత బాహుదా వంతెన నుంచి దానన్నపేట జంక్షన్ వరకు లైట్లు ఏర్పాటు చేయాలని లీలారాణి, జగన్ కోరారు. అన్ని వార్డులకు బోర్లు మంజూరు చేయాలని వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య కోరారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్, పలు విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్కడ పారిశుధ్య సిబ్బందితోనే సెలైన్


రోగికి సెలైన్ పెడుతున్న పారిశుధ్య సిబ్బంది

పొందూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పారిశుధ్య సిబ్బందే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగికి సెలైన్ ఎక్కిస్తున్న ఘటన శనివారం బయటపడింది. సిబ్బంది పనితీరుపై రోగులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సుజాతకు ఫిర్యాదు చేశారు.

వృథాగా విద్యుత్ స్తంభాలు



గార జూలై 26(ఆంధ్రజ్యోతి): కళింగపట్నం సంత మైదానం వద్ద విద్యుత్ స్తంభాలు వృథాగా పడి ఉన్నాయి. తీర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటుకు గాను సుమారు 8 సంవత్సరాల కిందట 24 స్తంభాలను తెప్పించారు. అయితే వాటిని నేటికీ అమర్చలేదు. దీంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజాధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్ర జ్యోతి): పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ అన్నారు. శనివారం ఎరువులు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కాళ్ల గోపి, లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

శివారు ఆయకట్టుకు నీరు

- ఆనందంలో రైతులు


కుడి ప్రధాన కాలువ చివరి గ్రామమైన రామజోగిపేట వద్ద కాలువకు చేరిన నీరు

ఎచ్చెర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): నారాయణపురం కుడి కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలోని శివారు గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరు చేరింది. గత కొన్నేళ్లుగా శివారు గ్రామాలకు సాగునీరు గగనంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈనెల 17న నారాయణపురం ఆనకట్ట వద్ద కుడి కాలువ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు విడిచిపెట్టారు. ఇటీవల బుడగట్లపాలెం వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి నారాయణపురం కాలువ దుస్థితి, ఎచ్చెర్ల మండల రైతుల సాగునీటి ఇక్కట్లను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తీసుకువెళ్లారు. నిధులు విడుదల కావడంతో సంతకవిటి మండలం రంగరాయపురం నుంచి భగీరథపురం కృష్ణసాగరం వరకు కాలువలో పూడికలతీత, గుర్రపు డెక్కను తొలగించారు. యుద్ధప్రాతిపదికన పొన్నాడ, రాజు గారి బ్రాంచ్ చానల్ వద్ద, కుశాలపురం, డోలపేట, ఇబ్రహీంబాద్ ఎర్రిబట్టి తదితర చోట్ల షట్టర్ల బిగింపు, మరమ్మతులు చేపట్టారు. దీంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందిలేకుండా పోయింది. దీనికి తోడు వరుణుడు కరుణించడంతో కాలువలో పుష్కలంగా నీరు ప్రవహించి శివారు గ్రామమైన రామజోగిపేట పంట పొలాలకు చేరింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది ఆశాజనకంగా పంటలు పండుతాయని నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు పేర్కొన్నారు.

సేంద్రియ విధానంతో రైతుకు లాభం


← ద్రవ, ఘన జీవామృతం తయారీని ఏడీఏ భవానీశంకర్

కంచిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సేంద్రియ విధానంతో రైతుకు లాభం చేకూరుతుందని సోంపేట వ్యవసాయశాఖ ఏడీ భవానీ శంకర్ అన్నారు. బూరగాం, గోకర్ణపురం గ్రామాల్లో గ్రామవ్యవసాయ సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించాలన్నారు. బూరగాంలో సేంద్రియ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతం తయారీని రైతులకు తెలియజేశారు. ఏవోలు బొర్ర నర్సింహమూర్తి, కొంకేన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీవలసలో ప్రత్యేక వైద్య బృందం పర్యటన

- రక్త నమూనాల సేకరణ


రోగులతో మాట్లాడుతున్న వైద్య బృందం

జి.సిగడాం, జూలై 26(ఆంధ్ర జ్యోతి): టీడీవలసలో గ్రామస్థులకు జ్వరాలు, కీళ్ల నొప్పులు, వాపులు తదితర రోగాలు తగ్గకపోవడంతో శనివారం జిల్లా కేంద్రం నుంచి ఆర్ఆర్‌టీ ప్రత్యేక వైద్య బృందం పర్యటించి వ్యాధులపై ఆరా తీసింది. ఇంటింటికీ వెళ్లి రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. వీటిని జిలాల కేంద్ర ఆసుపత్రిలో పరీక్షల నిమిత్తం తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. జిల్లా ప్రత్యేక వైద్య బృంద సభ్యులు కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మనోజ్, మైక్రో బయాలజీ బి.రాధిక, జనరల్ ఫిజీషియన్ పునిత్ రాహుల్, మెడిసిన్ విభాగం నుంచి రణధీర్‌రెడ్డి, జిల్లా మలేరియా నివారణ అధికారి సత్య నారాయణ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షాలు పడుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అవసరమైన రోగులకు మందులు అందజేశారు. రోగాలు తగ్గుముఖం పట్టేవరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.యశ్వంత్, సుమబిందు తెలిపారు. దోమలు బెడద, పారిశుధ్య లోపం వల్ల రోగాలు ప్రబలినట్లు వైద్య బృంద ప్రతినిధులు తెలిపారు. వారి వెంట ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ తదితరులున్నారు.

ఒడిశా విద్యార్థులకు ఫార్మా హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు జెమ్స్ కళాశాలలో ఒడిశా విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మా హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులను ఎన్‌యూఏ ఒడిశా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా అక్కడి ప్రభుత్వ సహకారంతో చేపట్టామన్నారు. ప్లస్ త్రీ పాసైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టు, ప్లస్ త్రీ పాసైన/ఫెయిలైన అభ్యర్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు కలిగినవారు అర్హులన్నారు. శిక్షణ పొందే విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందించనున్నామన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రు ల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 76809 45357, 7995013422, 8331118019 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. అలాగే జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కార్యాలయంలోసమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

పీ-4 అమలుపై శిక్షణ

లావేరు, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేని సక్రమంగా నిర్వహించేందుకు గాను శనివారం బెజ్జిపురం యూత్‌క్లబ్ కార్యాలయంలో క్లబ్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఎలా సర్వే చేపట్టేది చర్చించారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందజేయడం, ఆర్థిక సమస్యలను నివారించే దిశగా సంస్థ కృషి చేస్తుందని యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఇజ్జాడ అప్పారావు, గంట్యాడ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నేతలకు అరుదైన గౌరవం

ఆమదాలవలస, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు అరుదైన గౌరవం లభించిందని మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. శనివారం పట్టణ టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలన్న దృక్పథంతో చంద్రబాబు ముందుంటారన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్‌గా, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర మంత్రిగా, కలిశెట్టి అప్పల నాయుడును విజయనగరం ఎంపీగా అవకాశం కల్పించడం టీడీపీకే సాధ్య మన్నారు.

ఎరువుల పంపిణీ

గార రూరల్, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): కొర్ని గ్రామ సచివాలయంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి ఆధ్వర్యంలో ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి, ఏవో దుంపల పద్మావతి, ఆర్ఐ రాజేంద్ర, ఏఈవో దుర్గా ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్మికుడి దుర్మరణం

లావేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రావివలస వద్ద హైవేపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రణస్థలం మండలం కోటపాలెం గ్రామానికి చెందిన కోరాడ నర్సింహులు(34) నడుచు కుంటూ స్వగ్రామం వెళుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న నర్సింహులు శుక్రవారం ఉదయం పనుల కోసం రావివలస వెళ్లి రాత్రి వరకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. చివరికి రోడ్డు ప్రమాదంలో నర్సింహులు మృతి చెందినట్టు పోలీసుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. నర్సింహులకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింహులు తండ్రి సూరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎం.విజయానంద్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన గుజ్జల రామయ్య (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామయ్య వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన ఇంటి మేడ మెట్లు దిగుతూ జారి పడిపోయాడు. నగరంలోని ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తున్న రామయ్య భార్యకు స్థానికులు సమాచారమిచ్చింది. వెంటనే ఆమె వచ్చి దగ్గరలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్లి చికిత్స అందించి ఇంటికి తీసుకొచ్చింది. అనంతరం రామయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య హేమ ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం టూ టౌన్ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

21 పశువులు పట్టివేత

కోటబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సుబ్బారావుపేట జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 21 పశువులను పట్టుకొని వారి పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీలో పశువులు తరలిస్తున్నారని సమాచారంతో దాడి చేశామని, 16 గెదేలు, ఐదు దూడలు ఉన్నాయన్నారు. వాటిని సింహాచలం గోశాలకు తరలించామని తెలిపారు.

సారా తరలిస్తూ నలుగురి అరెస్టు

కంచిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 365 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంచిలి మండలం జక్కర రైల్వేగేటు సమీపంలో శనివారం కారులో అక్రమంగా తరలిస్తున్న 12 పాలిథిన్ కవర్లలో సారా, గోనె సంచిలో ఉన్న 1,250 సారా ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నారు. సారా తరలిస్తున్న సాలిన పుట్టుగకి చెందిన సాలిన సూర్యనారాయణ, కత్తివరానికి చెందిన మద్దిల ప్రసాద్, పులకపుట్టుగకి చెందిన పులక కూర్మారావు, ఒడిశాకు చెందిన లోకనాథంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బొడ్డేపల్లిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్టు ఎస్ఐ సీపాన కాంతారావు తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి రూ.8,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

● బూర్జ జూలై 26(ఆంధ్రజ్యోతి): ఓవీపేటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.7,720 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కాశీబుగ్గ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఎటువంటి భారం వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపడం సరికాదని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కాశీబుగ్గలో ఆయా పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యాదర్శి చాపర వెంకటరమణ, సీపీ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సీపీఎం నాయకులు గణపతి మాట్లాడుతూ.. పేదలపై విద్యుత్ భారాలను మోపడం సరికాదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వసం చేయమని చెప్పిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయో ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట చెప్పడం సరికాదని, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలకు మోసగించవద్దన్నారు. వచ్చే నెల 5న మండల కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాధవరావు, రామారావు, కుసుమ, బాలకృష్ణ, రవి, వీరస్వామి, అప్పన్న, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

● నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారం వేయమని చెప్పి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూప్ అఫ్ చార్జీలతో ప్రజలు నడ్డి విరుస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం నరసన్నపేటలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాన్యులకు అందుబాటులో విద్యుత్ చార్జీలు ఉండాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఉత్తరాంధ్ర నేతలకు గౌరవం

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నతమైన గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అశోక్ గజపతిరాజుకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతో పాటు నాయకులను కూడా అత్యున్నతమైన స్థానాల్లో కూర్చోబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చిన అశోక్‌గజపతిరాజును గవర్నర్ చేయడం, ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్రమంత్రి పదవి ఇవ్వడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం మచ్చుతునకలన్నారు.

సక్రమంగా ఎరువులు పంపిణీ చేయాలి

ఎల్ఎన్ పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సక్రమంగా ఎరువు లను పంపిణీ చేయాలని కొత్తూరు సబ్‌డివిజన్ అగ్రికల్చర్ ఏడీఏ బి.రాజగోపాల్ తెలిపారు. కరకవలస రైతుసేవా కేంద్రంలో శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఏవో కె.సింహాచలం, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

● హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారి సంధ్య చెప్పారు. శనివారం అంబావల్లి గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. తహసీల్దారు హనుమంతురావు తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలను పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజవర్గ ఈఆర్‌వో జయదేవి సూచించారు. శనివారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ శరత్‌కుమార్, టీడీపీ, వైసీపీ, జనసేన, సీపీఐ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త.. పట్టించుకోని యంత్రాంగం

● చెత్త సంపద కేంద్రం ఉన్నా నిరుపయోగమే..
● రాకపోకలకు ప్రజలు ఇబ్బంది


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఎదురుగానే పారబోస్తున్న వ్యర్థాలు

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలిలోని వ్యాపారులు, హోటళ్లు, చికెన్ సెంటర్లు, కల్యాణ మండపాల నిర్వాహకులు ప్రతీ రోజూ చెత్తను సమీప ప్రాంతంలోని రోడ్డు పక్కనే పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో అడ్డూ అదుపూ లేకుండా చెత్తను తెచ్చి గుంజుమెట్ట వద్ద పారబోసి చేతులు దులుపుకుంటున్నారు. శ్రీముఖలింగం వెళ్లే రోడ్డుకు ఉత్తర దిశ ప్రాంతం చల్లవానిపేట పంచాయతీ, దక్షిణ దిశ ప్రాంతం లింగాలవలస పంచాయతీ పరిధిలోకి వస్తాయి. చల్లవానిపేట చెత్త నుంచి సంపద కేంద్రం శ్రీముఖలింగం రోడ్డుకు ఉత్తర దిశలో ఉండగా.. దానికి ఎదురుగా రోడ్డుకి దక్షిణ దిశలో లింగాలవలస పంచాయతీ పరిధిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రానికి ఎదురుగా రోడ్డుపక్కనే చెత్తను పారబోసి అపరిశుభ్రం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే పారబోసిన చెత్త కుప్పలు వర్షానికి తడిసి దుర్వాసన వెదజల్లుతుందని అటుగా వెళ్లేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.లక్షలు వెచ్చించినా..

చెత్త నుంచి సంపద తయారీకి ప్రతీ పంచాయతీలోను లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామానికి దూరంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. వీటిని వినియోగంలోకి తేవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. దీంతో నిర్మించిన కేంద్రాలు వృథాగా పడి ఉన్నాయి. గ్రామాల్లో మాత్రం పారిశుధ్యం పనులు చేపట్టి పరిశుభ్రత పాటించాలని ర్యాలీలు తీయడమే తప్పా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు. దీంతో పలు పంచాయతీల్లో సేకరిస్తున్న చెత్తను ఎక్కడిబడితే అక్కడే పడేస్తున్నారు.

నోటీసులు జారీ చేస్తాం

గుంజుమెట్ట వద్ద శ్రీముఖలింగం వెళ్లే రోడ్డు పక్కన చెత్త పారబోస్తున్నవారికి నోటీసులు జారీ చేస్తాం. గుంజుమెట్ట వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నా చల్లవానిపేట కూడలిలో గల వ్యాపారులు ప్రతీ రోజూ చెత్త తెచ్చి పారబోస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

- ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ

అభివృద్ధి దిశగా అడుగులు


ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు పరిపాలనలో గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. గులుమూరు గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోగిరి బుచ్చిబాబు, టీడీపీ నాయకులు కె.అప్పలరాజు, ఎస్.గోవింద, టి.అప్పన్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● జలుమూరు (సారవకోట) జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ఇంటింటా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, పథకాలపై ఇంటింటా వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, బోర తాతయ్య, ఎస్.అప్పలనాయుడు, పిట్ట సింహాచలం, సోల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్‌సేవలు అందించాలి: గౌతు శిరీష


సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు కోతలులేని మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం మధ్యాహ్నం స్థానిక టిట్కో గృహ సముదాయం వద్ద రూ.4.95 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వినియోగదారులపై విపరీతమైన చార్జీలు పెంచారని, తమ ప్రభుత్వం ప్రజల మెచ్చేలా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీటీవీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడిగా తర్ర బలరాం, ఉపాధ్యక్షుడిగా డొక్క వెంకటరమణ పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఏడీ రవికిరణ్, కార్యదర్శి శారద, టీడీసీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విలియమ్స్

హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని టెక్కలి డిప్యూటీ డీఈవో విలియమ్స్ అన్నారు. శనివారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అములు, తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. ఎంఈవో కె.రాంబాబు, హెచ్‌ఎం టి.కేశవరావు ఉన్నారు.

అక్రమంగా రోడ్డు వేసినవారిపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న గిరిజనులు, సంఘ నాయకులు

హరిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూముల్లో అక్రమంగా రోడ్డు వేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఆదివాసీ వికాస పరిషత్తు మండల అధ్యక్షుడు సవర జగన్ డిమాండ్ చేశారు. మందస మండలం కొంకడాపుట్టి పంచాయతీ కిల్లోయి కొత్తవీధి గ్రామానికి చెందిన సుమారు పదిమంది గిరిజనుల భూముల్లో కనీసం ఎటువంటి సమాచారం లేకుండా యంత్రాల సాయంతో రోడ్డు నిర్మాణం చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని శనివారం గిరిజన సంఘ నాయకులు పరిశీలించి మాట్లాడారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సవర సోములయ్య, డొంబురు, రామారావు, కిరణ్, విజయ్, మోహనరావు, క్రిష్ణారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే బీసీల అభివృద్ధి


మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

టెక్కలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షనీయమని, కూటమి ప్రభుత్వం వల్లే బీసీల అభివృద్ధి జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వనమాలి శ్రీనివాసరావు అన్నారు. శనివారం టెక్కలిలో సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి అన్ని కులాలను కలుపుకొని కమిటీలు వేసి బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత విస్తరింపజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడిగా కిల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా సనపల బాలకృష్ణ, శ్రీరామ్, మహేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా టి.సునీత, టెక్కలి అసెంబ్లీ సోషల్‌మీడియా కన్వీనర్‌గా కె.ఆదినారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా ఎస్.హరిని నియమించినట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి పరామర్శ

పలాస రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసిన జాబు బాబూరావు ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని అదే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు.. ఒడిశాలోని పాత్రపురం గ్రామానికి వెళ్లి ఉపాధ్యాయుడి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో కిక్కర డిల్లీరావు, మద్దిల తిరుపతిరావు, బైనపల్లి కేశవరావు, మద్దిల కైలాస్, చిరంజీవి, సాంబమూర్తి, దీపు, ఈశ్వరరావు ఉన్నారు.

టెక్కలి విద్యార్థిని ప్రతిభ



హర్షిణిని అభినందిస్తున్న దృశ్యం

టెక్కలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): విశాఖలోని గీతం యూనివర్సిటీలో టెక్కలికి చెందిన బి.హర్షిణి బీటెక్ కంప్యూటర్ కోర్సులో చదువుతూ మూడు బంగారు పతకాలు సాధించింది. ఈ మేరకు ఎంపీ భరత్‌తో పాటు గీతం యూనివర్సిటీ వీసీ తదితరుల నుంచి శనివారం ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, సీఎస్‌ఈ బ్రాంచ్ టాపర్‌గా గోల్డ్‌మెడల్, కొల్లూరు లక్ష్మి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ప్రస్తుతం హర్షిణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కూడా ఎంపికైంది. ఈమె తల్లిదండ్రులు విజయ్‌శంకర్ గుప్త, హరిత, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిపాలనాధికారిగా బాధ్యతలు

కోటబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా కిల్లారి నారాయణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎచ్చెర్ల మండల పరిషత్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏవోగా పని చేసిన మంగరాణి గతనెల 30న ఉద్యోగ విరామణ పొందారు. నారాయణరావుకు పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

హరిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం పరామర్శించారు. మఖరజోలలో రిటైర్డు ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య తల్లి లక్ష్మీదేవి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని, భైరిసారంగపురంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రవికృష్ణ తండ్రి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, బమ్మిడి కర్రయ్య, భైరిశెట్టి గున్నయ్య, వాయిలపెల్లి మాధవరావు, నవీన్, సాలిన మాధవరావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

నందిగాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఇతర నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ నారాయణరావు అన్నారు. శనివారం చిన్నలవునిపల్లి, పెద్దలవునిపల్లి, బెజ్జిపల్లి, లఖిదాసుపురం గ్రామాల్లో చేపట్టిన పనుల్ని పరిశీలించారు. చిన్నలవునిపల్లి, లఖిదాసుపురంల్లో సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించారు. పెద్దలవునిపల్లి, బెజ్జిపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాలను పరిశీలించి వాటి ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ సత్యనారాయణ, మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పలాసరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. శనివారం ఆయన వివిధ ఎరువుల దుకాణాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏవో పోలారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● నందిగాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావును బీజేపీ నాయకులు హనుమంతు ఉదయభాస్కర్ కోరారు. శనివారం ఆయన్ను కలిసి ఎరువులు సరఫరా అవసరాన్ని వివరిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌పై అవగాహన కల్పించాలి

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఆన్‌లైన్ పద్ధతిపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని వెలుగు ప్రత్యేకాధికారి శ్రీగౌరి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీఎఫ్‌లు, సీసీల సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇక నుంచి మహిళా సంఘాలకు అందించే రుణాలు డిజిటల్ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయన్నారు. దీనివలన ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ఉంటాయన్నారు. సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలు ఆన్‌లైన్ చెల్లింపులు ద్వారా లావాదేవీలు జరుగుతాయన్నారు. మండలంలో 1,576 స్వయంశక్తి సంఘాలు ఉండగా ఇప్పటి వరకు 1,495 సంఘాలు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. మిగతా సంఘాలు కూడా నెలాఖరుకు ఆన్‌లైన్ చేసి సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీపీఎం నాగలక్ష్మి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు బగ్గు భవాని, కార్యదర్శి భైరి ఇందిర, సీసీలు బుడ్డెమ్మ, పలువురు సీ.ఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్



కాశీబుగ్గ: పలాస కాశీబుగ్గలో ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు



రణస్థలం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

కార్గిల్ విజయ్ దివస్ జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. పలువురు మాజీ సైనికులు మాట్లాడుతూ.. మాతృభూమి కోసం ఎంతోమంది జవాన్లు చేసిన త్యాగం ప్రతీ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం కల్చరల్: కార్గిల్ పార్కులో మాజీ సైనికులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



ఇచ్ఛాపురం: అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు



కిలో బియ్యం బదులుగా కిలో రాగులు

● జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఆగస్టు నెల నుంచి ఒక కిలో బియ్యం బదులుగా ఒక కిలో రాగులు పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజలకు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రాగులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తారు. రాగులు కావాలనుకునే రేషన్ కార్డుదారులు సంబంధిత డీలర్‌కు ముందుగానే తెలియజేయాల'ని జేసీ సూచించారు.

పలాస అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ వ్యూ

- భవిష్యత్ అవసరాల దృష్ట్యా మునిసిపాలిటీలో మార్పులు
- కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలు చేరిక
- గెజిట్ నోటిఫికేషన్‌పై అభిప్రాయాల స్వీకరణ

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి):

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీని సుడా (శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ) పరిధిలోకి తీసుకువచ్చి 2046 సంవత్సరం వరకూ అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి చేయనుంది. దీనికి సంబంధించి జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లోగా ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పేందుకు గడువు విధించారు. అనంతరం మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. జిల్లాకేంద్రమైన శ్రీకాకుళం తర్వాత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గను పూర్తిస్థాయిలో పట్టణీకరించేందుకు ఈ మాస్టర్‌ప్లాన్ ఎంతో దోహదం చేస్తుంది.

● ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ పరిధిలో మొత్తం 25 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మాస్టర్‌ప్లాన్‌లో కొత్తగా 21 రెవెన్యూ గ్రామాలను చేర్పించారు. అందులో కైజోల, సున్నాడ, శాసనం, రాజగోపాలపురం, కంబిరిగాం, ఈదురాపల్లి, కేదారిపురం, సొగిడియా, పండాశాసనం, బ్రాహ్మణతర్లా, అనంతగిరి, కిష్టుపురం, లక్ష్మీపురం, గరుడఖండి, బట్టుపాడు, మహదేవపురం, గోపాలపురం, నగరంపల్లి, పెద్దబడాం, రాజాం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ కింద వస్తాయి. ఇప్పటికే దీనికి సంబంధించి సమగ్ర సర్వే నిర్వహించి సుడా పట్టణాభివృద్ధిలోకి తీసుకురానున్నారు.



పలాస-కాశీబుగ్గ ముఖచిత్రం

ప్రజల అవసరాలకు అనుగుణంగా 20, 40 అడుగుల వెడల్పుతో రహదారులు నిర్మాణం జరగనున్నాయి. మొత్తం ఈ ప్రాంతాలన్నీ జోన్లవారిగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. రెసిడెన్సియల్ కాంప్లెక్స్‌లు, పారిశ్రామికవాడలు (మిగతా 6వ పేజీలో..)

అభివృద్ధి అవసరం..



భవిష్యత్ అవసరాలకు పలాస-కాశీబుగ్గ అభివృద్ధి చేయడం ఎంతో అవసరం ఉంది. శరవేగంతో పట్టణీకరణ జరుగుతున్న సమయంలో మాస్టర్‌ప్లాన్ అమలైతే విశాలమైన రహదారులు, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి జరుగుతుంది. దీనికి సంబంధించి ముసాయిదా ఇప్పటికే విడుదల చేశాం. ప్రజల అభ్యంతరాలు స్వీకరించి దానికి అనుగుణంగా అభివృద్ధి చేస్తాం.

-రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ

కూపన్ విధానంలో ఎరువుల పంపిణీ

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ఇన్‌చార్జిలు పంపిణీ చేస్తారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శనివారం జిల్లా వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో రైతు సేవా కేంద్రాలకు శనివారం 600 టన్నుల యూరియాను సరఫరా చేశాం. ప్రతీ రైతుసేవా కేంద్రానికి మండల వ్యవసాయాధికారి, తహసీల్దార్ల సంతకాలతో కూడిన కూపన్లు ఇవ్వనున్నాం. కూపన్ పొందిన రైతులు నిర్దేశిత సమయంలో వెళ్లి ఎరువును తీసుకోవాలి. రద్దీని నియంత్రించేందుకు ఈ విధానం అమలు చేస్తున్నామ'ని తెలిపారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

● పకడ్బందీగా ఏర్పాట్లు: జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల (చిలకపాలెం), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాల్లో ఆదివారం నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. ప్రత్యేక అవసరాలు గల అభ్యర్థులకు 20 నిమిషాల అదనపు సమయం, స్క్రైబ్ సదుపాయం కల్పించాలి. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ప్రాథమిక చికిత్స, పోలీసు బందోబస్తు తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థులను ఉదయం పరీక్షలకు 8-30 నుంచి 9-15 వరకు, మధ్యాహ్నం పరీక్షలకు 1.30 నుంచి 2.15వరకు అనుమతించాలి. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అభ్యర్థులు, ఇన్విజిలేటర్లకు అనుమతి లేద'ని తెలిపారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు భోగేశ్వరి, పి.పద్మప్రియ, ఇతర శాఖల ప్రతినిధులు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

అమ్మో.. పోస్టల్!

- కొందరు సిబ్బంది తీరుతో చిన్నబోతున్న తపాలాశాఖ
- ఇచ్ఛాపురంలో రూ.2.86 కోట్ల కుంభకోణంపై చర్చ
- కొనసాగుతున్న విచారణ

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని పోస్టాఫీసులో రూ.2.86 కోట్ల కుంభకోణం శుక్రవారం వెలుగులోకి రావడంతో.. తపాలాశాఖపై ఖాతాదారుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఆర్థిక పొదుపు సేవలకు నమ్మకమైన తపాలాశాఖలో కూడా అక్రమాలు చోటుచేసుకోవడం చర్చనీయాంశమవుతోంది. పోస్టల్ శాఖలో కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండడం ఖాతాదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇచ్ఛాపురంలో పోస్టల్ సిబ్బంది పాత్రతో ఈ స్కామ్ జరిగిందని అధికారుల విచారణలో తేలగా ఇప్పటికే ఐదుగురిని సస్పెండ్ చేశారు. దీనిపై మరింత విచారణ చేపడుతున్నారు. శనివారం కూడా సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, శ్రీకాకుళం పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ ఇచ్ఛాపురంలో పోస్టల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఖాతాదారుల వద్ద ఉన్న కిసాన్ వికాస్ పత్రాలు (కేవీపీ) బాండ్లను పరిశీలించారు. కొంతమంది ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో వారి నుంచి క్లయిమ్స్ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా చాలామంది ఖాతాదారులు పోస్టల్ కార్యాలయానికి చేరుకుని.. లబోదిబోమంటున్నారు. పోస్టల్‌లో సైతం డబ్బులు దాచుకోవడానికి భయపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

● ఇచ్ఛాపురానికి చెందిన ఓ వ్యక్తి 2016లో తన పిల్లల పేర్లు మీద రూ.11లక్షలు కేవీపీ బాండ్లపై డిపాజిట్ చేశారు. వారి ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసినట్టు ఉంది. దీంతో ఆ వ్యక్తి ఆందోళన చెందాడు.

● ఖజానా వీధికి చెందిన బి.మహాలక్ష్మి, బి.ఢిల్లమ్మ గతేడాది కేవీపీ బాండ్లపై రూ.3లక్షలు డిపాజిట్ చేశారు. శనివారం వారి ఖాతాను పరిశీలించగా.. డబ్బులు డ్రా చేసినట్టు ఉండడంతో వారు లబోదిబోమన్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నారు.

● ఇలా చాలామంది ఖాతాదారులు పోస్టల్ కార్యాలయం వద్దకు చేరుకుని తమ ఖాతాల్లో డబ్బులు ఉన్నాయో లేదోనని తనిఖీ చేయిస్తున్నారు. కొంతమంది ఖాతాలు ఖాళీగా కనిపిస్తుండడంతో కలవరపడుతున్నారు. కూలి చేసుకుని.. పిల్లల భవిష్యత్, ఆర్థిక అవసరాల కోసం డబ్బులు దాచుకున్నామని, తమ డబ్బులు తమకు ఇప్పించేలా చూడాలని పోస్టల్ అధికారులను వేడుకుంటున్నారు. కాగా ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సోంపేట, పలాస పోస్టల్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ తెలిపారు. ఈ కేసు సీబీఐకి అప్పగించామని, త్వరలోనే బాధ్యులందరికీ పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామన్నారు. ఖాతాదారులకు సకాలంలో ఆ డబ్బులు అందేలా చర్యలు చేపడతామన్నారు.



ఆవేదన చెందుతున్న మహాలక్ష్మి, ఢిల్లమ్మ



పోస్టల్ కార్యాలయంలో బాధితుల ఖాతాలను పరిశీలిస్తున్న అధికారులు

వారం కిందటే వచ్చి వెళ్లారు

- తెలంగాణ రాష్ట్రంలోని రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు దుర్మరణం
- స్వగ్రామం డోలలో విషాదఛాయలు



ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు (ఫైల్)



డోలలో శాంతారావు ఇంటివద్ద విషాదంలో బంధువులు

పోలాకి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రోడ్డుప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ, సీఎం స్పెషల్ సెక్యూరిటీ అధికారి(ఎస్.ఎస్.జీ) జల్లు శాంతారావు(56) మృతి చెందడంతో.. ఆయన స్వగ్రామం పోలాకి మండలం డోలలో విషాదఛాయలు అలుముకున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురం స్టేజి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు డీఎస్పీలు దుర్మరణం చెందగా, మరో (మిగతా 6వ పేజీలో..)

● ఐదుగురి సీఎంల వద్ద విధులు..

ఇంటెలిజెన్స్ డీఎస్పీ శాంతారావు పోలాకి, వెదుళ్లవలస గ్రామ పాఠశాలల్లో విద్యనభ్యసించారు. పోలీస్ విభాగ పోటీ పరీక్షలు రాసి 1992లో ఉమ్మడి హైదరాబాద్ రాజధానిలో కానిస్టేబుల్‌గా తర్వాత సీఐగా పదోన్నతి పొందారు. అనంతరం రాష్ట్ర విభజన తర్వాత విజయవాడకు బదిలీ అయ్యారు. ఐదుగురు సీఎంల వద్ద సెక్యూరిటీ సీనియర్ గ్యాంగ్(ఎస్.ఎస్.జి) ఇంటెలిజెన్సీ సీనియర్ అధికారిగా(డీఎస్పీ స్థాయి) విధులు నిర్వర్తించారు. మంచి అధికారిగా వారి మన్ననలు పొందారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ వింగ్ విభాగంలో డీఎస్పీగా ఆయన పని చేస్తున్నారు.

● కుటుంబ నేపథ్యమిదీ..

డీఎస్పీ శాంతారావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు బాలగంగాధర్‌తిలక్, శ్రీరామ్ ఉన్నారు. శాంతారావు దంపతులు అమరావతిలో నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు తిలక్‌కు 2023లో వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్రీరామ్ ఉన్నత చదువు నిమిత్తం రెండేళ్ల కిందట థాయిలాండ్ వెళ్లాడు. శాంతారావు సోదరుడు జల్లు జగన్నాయకులు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. శాంతారావుకు డోలలో సొంతిల్లు ఉంది. అప్పుడప్పుడూ స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవారని బంధువులు తెలిపారు.

దేహం ఇక్కడ.. ప్రాణం అక్కడ!

● తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు ● ఉపాధి కోసం వెళ్లక తప్పని వైనం
● ఫోన్‌లో పలకరింపులకే అధికశాతం పరిమితం ● నేడు 'పేరెంట్స్ డే'

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

● నరసన్నపేటలో రాజుల చెరువు, కూరగాయల మార్కెట్ అభివృద్ధి
● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో



షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీజీ ప్రతాప్

అగ్నిప్రమాదాల నివారణకు బ్రీతింగ్ బాల్కనీలు

● షాపింగ్ మాల్స్‌లో ఏర్పాటు చేసుకోవాలి ● శ్రీకాకుళం నుంచే శ్రీకారం
● విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

6లో

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● ప్రతిరోజూ గ్రామాలను సందర్శించాలి: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

టీడీవలసలో ప్రత్యేక వైద్య బృందం పర్యటన

7లో

నకిలీ పట్టాలతో.. ప్రభుత్వ భూమి హాంఫట్

- సైలాడ కొండ ప్రాంతం ఆక్రమణకు యత్నం
- పరిసరాల్లోని గ్రామస్థుల ఆందోళన
- ఎమ్మెల్యే, అధికారులకు ఫిర్యాదు

ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం మారినా.. భూ దందాలు మాత్రం ఆగడం లేదు. వైసీపీ పాలనలో కొండలు, గుట్టలు, కాలువలు, ప్రభుత్వ భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయి. అప్పట్లో నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలతో భూ అనుమతులు సృష్టించిన వ్యక్తులు.. ఇప్పటికీ ఆక్రమణలు కొనసాగించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..



రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఆమదాలవలస మండలం చిట్టివలస ప్రాంతంలోని సైలాడ రెవెన్యూ గ్రామంలో కొండను ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రభుత్వం తనకు డీ పట్టా మంజూరు చేసిందని స్థానికులను నమ్మిస్తూ.. సైలాడ కొండను ఆక్రమించాలని భావించాడు. దీంతో పరిసర గామాలైన గాజుల కొల్లివలస, చిట్టివలస, సైలాడకు చెందిన ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆక్రమణ ల వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ గ్రామాలకు చెందిన సవర చిన్నా రావు, బంటుపల్లి కూర్మారావు, నూలు లక్ష్మణ, భోగి నాగరాజు, లబ్బ రమణ, పి.సూరి, ఎర్రంనాయుడు, శ్రీను తది తరులు ఆమదాలవలస రెవెన్యూ కార్యాలయంలో కూడా గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'రెవెన్యూ సర్వే నెంబర్ 183 కలిగిన సైలా డ కొండ ప్రాంతంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు 294, 295-2, 296-1, 296-3 కలిగిన తప్పుడు సర్వే నెంబర్లతో గతంలో డీ పట్టాలు మంజూరు చేసినట్టు తెలిసింది. తప్పుడు సర్వే నెంబర్లు, నకిలీ పట్టాతో ఓ అక్రమార్కుడు సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పనులు ప్రారంభించాడు. సైలాడ గ్రామ రెవెన్యూ పరిధిలో ఎఫ్ ఎంబీలు 292, 293 వరకు మాత్రమే ఉండగా, 296 సర్వే నెంబర్ ఎక్కడ నుంచి పుట్టుకొచ్చిం దని ప్రశ్నించారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి నకిలీ పట్టాలను రద్దు చేయడంతోపాటు ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఆ ప్రాంతమంతా టెపో గ్రాఫికల్ (మిగతా 6వ పేజీలో..)



ఆక్రమణకు గురైన సైలాడ కొండ ప్రాంతం

దేహం ఇక్కడ.. ప్రాణం అక్కడ!

- తల్లిదండ్రులకు దూరంగా బిడ్డలు
- ఉపాధి కోసం వెళ్లక తప్పని వైనం
- ఫోన్‌లో పలకరింపులకే అధికశాతం పరిమితం
- బాధ్యతలను మరచిపోని వారు ఎందరో

నేడు 'పేరెంట్స్ డే'



ఏ తల్లిదండ్రులైనా పిల్లలను ప్రాణపదంగా ప్రేమిస్తారు. కాలక్రమంలో ఉపాధి.. ఉద్యోగాన్వేషణలో భాగంగా తల్లిదండ్రులకు దూరంగా పిల్లలు ఉండాల్సి వస్తోంది. కొందరైతే కుటుంబ పోషణ కోసం తప్పనిసరిగా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. నిత్యం పలుకరించే కుటుంబ అవసరాలు... వేధించే ఆర్థిక సమస్యలు... కనుచూపుమేర కనిపించని ఉపాధి అవకాశాలు... మరికొందరిని విదేశాల బాట పట్టిస్తుంటాయి. అక్కడ ఉద్యోగావకాశాలు బాగున్నా.. ఆర్థిక అవసరాలను దాటగలుగుతున్నా... కన్నబిడ్డలు కళ్ల ముందు లేరనే దిగులు తల్లిదండ్రులను వెంటాడుతోంది. కొందరు బిడ్డలు విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నా... చేతి నిండా డబ్బులు ఉంటున్నా... ఇక్కడి వారి తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పొరుగు వారి సాయానికై వేచి చూడాల్సిన పరిస్థితి. ఎంతదూరంలో ఉన్నా..తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకుంటున్న వారు కొందరైతే... మరచిపోతున్న వారు కొందరు. ఇక బిడ్డలు దూరంగా ఉంటున్నారని నిరాశ చెందుతున్న తల్లిదండ్రులు కొందరైతే... ఎంతదూరంలో ఉన్నా... అభిమానాన్ని చాటుకోవడం కష్టంగా కాదని ఆశావాద దృక్పథంతో ముందుకెళుతున్న తల్లిదండ్రులు కొందరు. ఆదివారం 'పేరెంట్స్ డే' సందర్భంగా అలాంటి కొందరు తల్లిదండ్రుల గురించి తెలుసుకుందాం.

దక్షిణాఫ్రికాలో పిల్లలు... ఇక్కడ తల్లిదండ్రులు

సరుబుజ్జిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్నేహితుల సాయంతోనో... తెలిసిన వారి తోడుగానో.. ఉపాధిని వెదుక్కుటూ దేశం కాని దేశానికి వెళ్లిపోయారా యువకులు. కొందరు భార్య, చిన్న పిల్లలను.. మరి కొందరు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఇలా.. కుటుంబాలను వదిలిపెట్టి... ఉపాధి కోసం వెళ్లారు. రకరకాల కారణాలతో వారు రెండు, మూడేళ్ల అక్కడే ఉండాల్సి రావడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు. ఇదీ సరుబుజ్జిలి, నందికొండ తదితర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకుల పరిస్థితి. వీరిలో కొందరు దక్షిణాఫ్రికాలో లిక్కర్ పరిశ్రమలలో ఉపాధి పొందుతున్నారు. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన మెట్ట నాగభూషణం, కొమ్మనాపల్లి రాజేష్, ఎండ వరహాలనాయుడు, రాకోటి నరేష్, గరికిపాటి రాజు, ఇలపండ పృథ్వీరాజ్, పేడాడ వంశీ, నందికొండ గ్రామానికి చందిన డి.ఎన్. శ్రీను, బెండి కోటేశ్వరరావు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నారు. వీరిలో కొంతమంది డిగ్రీ పూర్తి చేయగా.. మరికొంతమంది మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పి.. కుటుంబ పోషణ నిమిత్తం విదేశాల బాట పట్టారు. పండగలు, ఇతర శుభకార్యాలు కుటుంబ సభ్యులందరూ కలిసే చేసుకొనే అవకాశం లేకపోవడంతో అక్కడ వారు.. ఇక్కడ వృద్ధులైన తల్లిదండ్రులు బాధ పడుతున్నారు. రాజేష్ తండ్రి మరణించారు. తల్లి మాత్రమే ఉంది. ఆమె ఇటీవల తీ ప్ర అనారోగ్యానికి గురైంది. కుమారుడికి సమాచారం తెలిసినప్పటికీ ఉపాధి అవకాశాలు కోసం చేసుకున్న అగ్రిమెంట్‌లో భాగంగా ఇక్కడికి రాలేని పరిస్థితి. తల్లి, కుమారుల మధ్య కేవలం ఫోన్‌లోనే పలకరించుకునే పరిస్థితి. నాగభూషణం తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. అయినా కుమారుడిది రాలేని పరిస్థితి. పెండ్లి సంబంధం కుదుర్చుకొని... రెండేళ్లలో వచ్చి వివాహం చేసుకుంటానని శ్రీను దక్షిణాఫ్రికాకు వెళ్లాడు. అనివార్య కారణాల వల్ల మరో ఏడాది అక్కడ ఉండాల్సి రావడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆవేదనకు గురవుతున్నారు. వీరే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన మరికొంతమంది నిరుద్యోగ యువకులు కూడా దక్షిణా ఫ్రికాలో ఇదే విధంగా ఉపాధి కోసం వెళ్లారు. వారి కుటుంబాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

బిడ్డలు దూరంగా.. ఆవేదన తోడుగా..

పలాస, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన ఓ వ్యక్తి 15 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహాలయ్యాయి. పిల్లలు దేశంలోని వేర్వేరు ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడ్డారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎవరు ఆసరాగా ఉంటారన్నది నిర్ధారించకపోవడం... ఉన్న ఊరిపై మమకారంతో ఆ దంపతులు ఇంటికే పరిమితమయ్యారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరికీ వయసు మీద పడడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారి పరిస్థితి దయనీయంగా మారింది. పింఛను రూపంలో చేతిలో డబ్బులు ఉన్నా... రక్తసంబంధీకులు ఎవరూ అందుబాటులో లేకపోవడం వారిని తీవ్రంగా కలచివేస్తోంది. చివరకు ఆసుపత్రికి వెళ్లాలన్నా... బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా చేద్దామన్నా పొరుగు వారిపై ఆధారపడక తప్పని పరిస్థితి. కుమారులు, కుమార్తెలు ఉన్నా వారు ఒంటరైపోయారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే... మరో వృద్ధ దంపతుల పరిస్థితి మరింత హృదయవిదాకరంగా మారింది. పొరుగువారి ఓదార్పే వారికి శ్రీరామరక్షగా నిలుస్తోంది. రైల్వేశాఖలో పనిచేసి విరమణ చేసిన ఆయనకు మొత్తం ఐదుగురు సంతానం. అందులో ఇద్దరు మృతి చెందగా... మరో ఇద్దరు విదేశాల్లో భార్యాబిడ్డలతో స్థిరపడ్డారు. నిత్యం తల్లిదండ్రులకు యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం తప్ప స్వయంగా సాయం అందించే పరిస్థితి లేదు. దీంతో నిత్యం ఒంటరిగా ఆ వృద్ధుడు విలపించడం తప్ప..ఏమీ చేయలేకపోతున్నాడు. వారి కుమారులు తల్లిదండ్రులను ఓదార్చడం తప్ప తమతో తీసుకెళ్లలేకపోవడం గమనార్హం.

ప్రేమగా చూసుకుంటున్నారు..

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురానికి చెందిన ఆశి ప్రకాశరెడ్డి అనే ఉపాధ్యాయుడు ఈ ప్రాంతంలో అందరికీ సుపరిచితులు. ఆయన భార్య కాంతమ్మ గృహిణి. వీరికి ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు రమేష్ మృతిచెందారు. ప్రకాశరెడ్డి 2008లో కన్నుమూశారు. చిన్న కుమారులు సురేష్, సతీష్ ఇద్దరూ ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తమతో పాటు తల్లి కాంతమ్మను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడి వాతావరణం నచ్చక ఆమె ఇచ్ఛాపురంలోనే ఉంటున్నారు. దీంతో తల్లి కోసం కుమారులు కేర్ టేకర్స్‌ను నియమించారు. కంటికి రెప్పలా చూసుకుంటూ వస్తున్నారు. ఏటా సంక్రాంతికి ఇద్దరు పిల్లలూ కుటుంబాలతో వచ్చి గడుపుతుంటారు. పిల్లలు తనకు ఎటువంటి లోటు చేయరని.. తమ సమ్మతితోనే వారు విదేశాలకు వెళ్లినట్టు కాంతమ్మ చెబుతుంటారు. తల్లి కోసం పట్టణ పరిధి కార్థి వీధిలో పెద్ద భవనాన్ని నిర్మించారు. అక్కడే ఆమె ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అభిమానానికి దూరం ఉండదు..



అంగూరు గణపతిరావు

పాతపట్నం, జూలై 26(ఆంధ్రజ్యోతి): దూరం అనేది మనుషుల మధ్య అభిమానాన్ని చాటుకోవడానికి అడ్డురాదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అంగూరు గణపతిరావు అన్నారు. స్థానిక నరసింహనగర్‌కు చెందిన గణపతిరావు భార్య లలిత కుమారి గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడు ప్రవీణ్ కుమార్, కోడలు కరిష్మా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కుమార్తెలు కాంచన డెంటిస్టుగా, సుజన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కుటుంబాలతో బెంగళూరులో ఉంటున్నారు. పిల్లలు దూరంగా ఉన్న విషయమై గణపతిరావు మాట్లాడుతూ తల్లిదండ్రులకు అవసరమైన సమయాన్ని కేటాయిస్తూ పిల్లలుల తమను ఆనందంగానే ఉంచు తున్నారని తెలిపారు. తల్లి లలితకుమారి మాట్లాడుతూ అప్పుడప్పుడూ దూరంగా ఉన్నారనే చిన్న దిగులు కలుగుతుంది. తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఆ అసంతృప్తిని అధిగమించ గలుగుతున్నామని తెలిపారు. దూరంగా ఉన్నారనే భయంగానీ.. దిగులు గానీ లేదనే చెబుతున్నారు.



పలాస: చెరువును తలపిస్తున్న తాళభద్ర రోడ్డు

చెరువులు కాదు.. రోడ్లే

పలాస/మెళియాపుట్టి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అడుగడుగునా గోతులతో ఇవి నిండిపోయాయి. దీంతో పాదచారులు, వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ గోతుల్లో నీరు చేరి.. చెరువుల్లా మారిపోయాయి. దీంతో ప్రమాదాల సంఖ్య మరింత పెరుగుతోంది. కొన్ని రోడ్ల పనులు మధ్యలో నిలిచిపోవడం... కొన్ని రహదారుల పనులు చేపట్టకపోవడంతో దారుణంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి... ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మెళియాపుట్టి: భావనాపురం రహదారి ఇలా...

అగ్ని ప్రమాదాల నివారణకు
బ్రీతింగ్ బాల్కనీలు

- షాపింగ్ మాల్స్‌లో ఏర్పాటు చేసుకోవాలి
- శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడుతున్నాం
- ఇది దేశవ్యాప్తంగా ప్రచారం కావాలి
- విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్

శ్రీకాకుళం క్రైం/అరసవల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'దేశంలోని షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లు నేడు బహుళ అంతస్థుల కాంక్రీట్ బాక్సులుగా ఉంటున్నాయి. ఇటువంటి మాల్స్‌లో అగ్నిప్రమాదం సంభవిస్తే తీవ్ర ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. దీనికి నివారణగా షాపింగ్ మాల్స్‌లో బ్రీతింగ్ బాల్కనీలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.'.. అని విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ (ఐపీఎస్) పేర్కొన్నారు. నగరంలోని ఓ షాపింగ్‌మాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ ఏడాది జనవరి 25న శ్రీకాకుళం నగరంలోని ఓ పెద్ద షాపింగ్‌మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక సిబ్బంది మాల్ లోపలకు వెళ్లడానికే ఆరు గంటల సమయం పట్టింది.



షాపింగ్ మాల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

మంటలను అదుపు చేయడానికి మరో ఆరు గంటల సమయం పట్టింది. అదృష్టవశాత్తు మాల్ పని గంటల సమయంలో ఈ ప్రమాదం జరగకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ, ఇది అందరికీ ఒక గుణపాఠం లాంటిది. దీనికి సరైన పరిష్కారం కోసం చాలామంది నిపుణులతో మాట్లాడాం. షాపింగ్‌మాల్‌సలో ప్రతి అంతస్థుకు ఒక బ్రీతింగ్ బాల్కనీ నిర్మించడం ద్వారా ప్రమాదం జరిగినా ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా నివారించవచ్చు. దీనికి శ్రీకాకుళం నగరం నుంచే శ్రీకారం చుడుతున్నాం. అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్‌మాల్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రతి అంతస్థుకు బ్రీతింగ్ బాల్కనీలు నిర్మించారు. చాలా సులువైన, తక్కువ ఖర్చుతో కూడుకున్న, ఎటువంటి మెయింటెనెన్స్ అవసరం లేని ఏర్పాటు ఇది. దేశంలోని అన్ని షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లలో బ్రీతింగ్ బాల్కనీలు నిర్మించాలి. ఇటీవల ఇరాక్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం సంభవించి 82 మంది ప్రాణాలు కోల్పోయారు. మన దేశంలో ఇటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కొత్తగా మాల్స్‌కు సంబంధించి, భవనాల అనుమతుల్లో మార్పులు చేశాం. ముందుగా స్మోక్ టెస్ట్ నిర్వహించి, ఆ తరువాతనే అనుమతులు జారీ చేస్తాం.' అని అన్నారు. తొలుత మాల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగితే ఎలా ప్రాణనష్టం జరగకుండా నివారించాలి అన్న విషయంపై షాపింగ్‌మాల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ అధికారి నిరంజన్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహనరావు, సహాయ అధికారి కె.శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ప్రతాప్

మూలపేట పోర్టు పరిశీలన..

సంతబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టును రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శనివారం పరిశీలించారు. సిబ్బందిని అడిగి..వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, పోర్ట్ జీఎం శంకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

- పేటలో రాజుల చెరువు, కూరగాయల మార్కెట్ అభివృద్ధి
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తదితరులు

నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించే బాధ్యతను పంచాయతీ, రెవెన్యూ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం స్థానిక ఎమ్పీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నియోజవర్గ స్థాయి సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నరసన్నపేట పట్టణంలోని రాజుల చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి కృషి చేయాలని, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, పార్కు నిర్మించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. చెరువులోకి మురుగు కాలువల నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులోని అక్రమణలను తొలగించాలని, స్నానాల ఘాట్‌లను పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి జలవనరుల శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు కలిసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మినీ స్టేడియానికి సంబంధించి ఉడెన్ ఫ్లోర్, లైటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. శాప్ ఛైర్మన్‌తో మాట్లాడి... పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ అండ్‌బీ భవనం వద్ద పార్కు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కామేశ్వరిపేట, లుకలాం, బొంతు ఎత్తిపోతల పనులు, సాగునీరు- తాగునీరు పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్, ట్రైనీ కలెక్టర్ డి. పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా ఉద్యానవనశాఖ ఏడీ వరప్రసాద్, టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, డీసీహెచ్‌వో కళ్యాణ్‌బాబు, ప్రత్యేక అధికారి అనురాధ, తహసీల్దారు సత్యనారాయణ, ఎంపీడీవో కె.వెంకటేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన..

సమీక్ష అనంతరం నరసన్నపేట వంద పడకల ఆసుపత్రిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో అదనపు భవనాల నిర్మాణ పనులు నత్తనడకగా సాగడంపై ఆరా తీశారు. అలాగే ఓపీ, వార్డులను పరిశీలించారు. ఆర్థో, ఆప్తమాలజీ శస్త్రచికిత్సలు జరగకపోవడానికి గల కారణమేంటని డీసీహెచ్‌ఎస్ కల్యాణ్‌బాబును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించాలని, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పలాస అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

(ఐదో పేజీ తరువాయి)

కమర్షియల్ ప్రాంతాలు, అగ్రికల్చర్ జోన్లు, విద్యు త్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, పెట్రోలు బంకులు మొ త్తం అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. పథకమంతా జాతీయరహదారికి అనుసంధానం చేసి గ్రామాలు, పట్టణాభివృద్ధి జరిపేందుకు పొంది పరిచారు. ఇప్పటికే పలాస-కాశీబుగ్గ.. జీడి పారిశ్రా మికవాడగా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన విషయం విధితమే. మన జీడిపప్పుకు జాతీయ స్థాయి అవార్డు కూడా లభించింది. ఈ నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్ భవిష్యత్ అవసరాలకు అమలైతే జిల్లా కేంద్రం తరువాత ఆ స్థాయిలో జంట పట్టణాలు సుందరీకరణకు అవకాశం ఉంటుందని జంట పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ పట్టాలతో.. ప్రభుత్వ భూమి హాంఫట్

(ఐదో పేజీ తరువాయి)

సర్వే చేసి ఇప్పటివరకు ఉన్న సర్వే నెంబర్లు ప్ర భుత్వ భూములను గుర్తించాలన్నారు. నకిలీ పట్టా దారుడుకు వత్తాసు పలుకుతూ.. అతని పట్టాలో ఉన్న సర్వే నెంబర్లు మార్పిడి చేస్తే కోర్టును ఆశ్ర యిస్తామన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- ఈ విషయమై తహసీల్దార్ ఎస్.రాంబాబు వద్ద ప్రస్తావించగా.. 'గతంలో సైలాడ కొండ ప్రాంతంలో పట్టాలు అందజేశాం. ప్రస్తుతం ఆ ప్రాంత భూములు ఆక్రమణపై కొంతమంది ఫిర్యాదు చేశా రు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇరు వర్గాల ఆరోపణలపై విచారణ చేస్తాం. ఆక్రమణ నిజమైతే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

వారం కిందటే వచ్చి వెళ్లారు

(ఐదో పేజీ తరువాయి)

ఏఎస్సీ, కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒక డీఎస్పీ శాంతారావుది పోలాకి మండలం డోల గ్రామం. శాంతారావు దుర్మరణ వార్త తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. శాంతారావు వారం రోజుల కిందటే గ్రామానికి వచ్చి.. అందరితో సరదాగా గడిపారని, ఇంతలోనే మృతి చెందడం బాధాకరమని ఆయన బంధువు జే.శివరాం, గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. శాంతారావు మృతదేహం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. నరసన్నపేట సీఐ మరడాన శ్రీనివాసరావు తన సిబ్బందితో డోల గ్రామానికి వెళ్లి.. మృతుడి బంధువులను పరామర్శించారు. మృతదేహాన్ని త్వరగా తెచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని అధైర్యపడవద్దని తెలిపారు. అలాగే శాంతారావు దుర్మరణంపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, మాజీ డీసీసీబీ ఛైర్మన్ డోల జగన్, కరిమిరాజు, ఎం.వి.నాయుడు, ఎస్ఐ రంజిత్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైసీపీ పాలన అవినీతిమయం: ఎమ్మెల్యే అశోక్



కరపత్రాలిచ్చి అవగాహన కలిగిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలన అంతా అవినీతి మయమేనని, ఇసుక నుంచి మద్యం వరకు దోచుకున్నారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. లక్కవరంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పాలనను ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ చంద్రమోహన్, రాష్ట్రకార్యదర్శి మద్దు కుమార్, నాయకులు చిత్రాడ శ్రీనివాసరావు, జీకే నాయుడు, సనపల శ్రీరాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే శంకర్



గొంటిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

గార రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించేందుకు ప్రతి పల్లె అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గొంటి, బలరాంపురం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీలో 'గొండు'

శ్రీకాకుళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టసభలకు పలు కమిటీలను నియమించింది. ఇందులో భాగంగా వన్య ప్రాణులు, పర్యావరణ పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, గొండు శంకర్, చింతమనేని ప్రభాకర్, నందమూరి బాలకృష్ణ, పులిపర్తి వెంకటమణిప్రసాద్, బుడ్డా రాజశేఖరరెడ్డి, వేగేశన నరేంద్రవర్మ రాజు, ఎమ్మెల్సీలు చిన్న గోవిందరెడ్డి దేవసాని, బి.తిరుమలనాయుడు, పాలవలస విక్రాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బీజేపీని బలోపేతం చేయాలి

పాత శ్రీకాకుళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్ కమిటీల నుంచి బలోపేతం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. పార్టీ జిల్లా నూతన పదాధికారుల తొలి సమావేశం శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నేతలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి విజయానంద్, జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, కోర్ కమిటీ సభ్యులు పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబు, బడే తాతారావు, శవ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌదరి అవినాష్ పుట్టినరోజు వేడుకలు



చౌదరి అవినాష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ పుట్టినరోజు వేడుకలు ఎస్ఎంపురంలోని ఆయన స్వగృహంలో శనివారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యుల సమక్షంలో అవినాష్ కేక్ కట్‌చేశారు. టీడీపీ నేతలు బెండు మల్లేశ్వరరావు, ముప్పిడి సురేష్, అల్లుపల్లి రాంబాబు, గూరు జగపతిబాబు, గొంటి నర్సింగరావు, సంపతిరావు గణపతిరావు, గాడు రామారావు, డీసీఎంఎస్‌తో పలు శాఖల ఉద్యోగులు, కూటమి నేతలు అవినాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రిఅచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ అవినాష్‌కు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈసీ సభ్యుడిగా సుధాకర్



ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఆమదాలవలసకి చెందిన డాక్టర్ చాపర సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన ప్రస్తుతం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. తనపై నమ్మకం ఉంచి మెంబర్‌గా నియమించేందుకు కృషి చేసిన మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి వైద్యరంగం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

సోంపేట, రూరల్ 26(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. పైడిగాం గిరిజన గ్రామంలో వంద న వికాస్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. మాల గోవిందపురం పంచాయతీ బకుడా, కొత్త బాతుపురం, పైడిగాం గ్రామాల్లో అవగాహన కల్పించారు. సీసీ శ్రీనివారావు, వీవోఏ జ్యోతిరాజు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో తిరుమల చైతన్య

కవిటి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ పాఠశాలలను శనివారం డీఈవో తిరుమల చైతన్య ఆకస్మికంగా సందర్శించారు. బల్లి పుట్టుగ, కళింగ పట్నం గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. కళింగ పట్నంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ ఉపాధ్యాయులు ఉన్నారు.

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ప్రతిరోజూ గ్రామాలను సందర్శించాలి
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లు, విజిబుల్ పోలీసింగ్, అవేర్నెస్ ప్రోగ్రాం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జి షీట్‌లను కోర్టులో దాఖలు చేయాల న్నారు. గంజాయి, మద్యం, సారా, పశువుల రవాణాపై నిఘా పెట్టి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. పోలీస్ అధికారులు ప్రతిరోజూ గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి నారీశక్తి సంకల్పం పేరిట మహిళా భద్రతా అంశానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చి అవగాహన కలిగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా వాదించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం, వివిధ కేసులను ఛేదించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐలు ఇమ్మా న్యుయేల్ రాజు, అవతారం, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలిచ్చి అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎంవీ అప్పారావు, డి.లక్ష్మణరావు, ప్రసాద రావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టెక్కలి డీఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా టెక్కలికి వచ్చిన డి.లక్ష్మణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించి శనివారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెక్కలి సబ్ డివిజన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, మహి ళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, గంజాయి, మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీకి ఎస్పీ దిశా నిర్దేశం చేశారు.

చర్చించకుండా అజెండాలో ప్రతిపాదిస్తే ఎలా?

- రూ.55 లక్షల పనులపై కౌన్సిలర్ల అభ్యంతరం
- అవసరమైన ప్రాంతాల్లో వీధిలైట్లు వేయాలి



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముందస్తుగా ఏయే వార్డుల్లో ఏ పనులు చేపట్టాలో సమావేశంలో చర్చించి తదుపరి అజెండాలో పొందుపరచాలని, అలా కాకుండా రూ.55 లక్షల పనులను ఎలా ప్రతిపాదించారని పలువురు సభ్యులు ప్రశ్నించారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, టీడీపీ కౌన్సిలర్ ఆశి లీలారాణి మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా 16 పనులను రూ.55 లక్షలతో చేపట్టేందుకు అజెండాలో ఎలా పెట్టారని అధికారులను ప్రశ్నించారు. కౌన్సిలర్లతో చర్చిస్తే ఏ సమస్యలున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలో తెలుస్తాయని, అలా కాకుండా ఏకపక్షంగా పనులు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనికి చైర్‌పర్సన్ రాజలక్ష్మి స్పందిస్తూ.. ఇంకా అవసరమైన పనులకు మరలా నిధులు కేటాయించి పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. అర్హత లేని కాంట్రాక్టర్లకు పనులు కేటాయించడంపై కొందరు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, పనులు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లకు అడ్డు చెప్పడం సరికాదని, అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని కౌన్సిలర్లు లీలారాణి, బి.జగన్ కోరారు. మునిసిపాలిటీ పరిధిలో కార్యాలయం నుంచి మార్కెట్ జంక్షన్ వరకు మాత్రమే సెంటర్ లైటింగ్‌ను నిధులు కేటాయించడం కాదని, లైటింగ్ లేని పాత బాహుదా వంతెన నుంచి దానన్నపేట జంక్షన్ వరకు లైట్లు ఏర్పాటు చేయాలని లీలారాణి, జగన్ కోరారు. అన్ని వార్డులకు బోర్లు మంజూరు చేయాలని వైస్ చైర్‌పర్సన్ భారతి దివ్య కోరారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రమేష్, పలు విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అక్కడ పారిశుధ్య సిబ్బందితోనే సెలైన్



రోగికి సెలైన్ పెడుతున్న పారిశుధ్య సిబ్బంది

పొందూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పారిశుధ్య సిబ్బందే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగికి సెలైన్ ఎక్కిస్తున్న ఘటన శనివారం బయటపడింది. సిబ్బంది పనితీరుపై రోగులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సుజాతకు ఫిర్యాదు చేశారు.

వృథాగా విద్యుత్ స్తంభాలు



గార జూలై 26(ఆంధ్రజ్యోతి): కళింగపట్నం సంత మైదానం వద్ద విద్యుత్ స్తంభాలు వృథాగా పడి ఉన్నాయి. తీర ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటుకు గాను సుమారు 8 సంవత్సరాల కిందట 24 స్తంభాలను తెప్పించారు. అయితే వాటిని నేటికీ అమర్చలేదు. దీంతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజాధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ఇచ్ఛాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని, రైతులు వినియోగించుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ అన్నారు. శనివారం ఎరువులు పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కాళ్ల గోపి, లోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

శివారు ఆయకట్టుకు నీరు

- ఆనందంలో రైతులు



కుడి ప్రధాన కాలువ చివరి గ్రామమైన రామజోగిపేట వద్ద కాలువకు చేరిన నీరు

ఎచ్చెర్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): నారాయణపురం కుడి కాలువ ద్వారా ఎచ్చెర్ల మండలంలోని శివారు గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరు చేరింది. గత కొన్నేళ్లుగా శివారు గ్రామాలకు సాగునీరు గగనంగా మారింది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే నీరు చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈనెల 17న నారాయణపురం ఆనకట్ట వద్ద కుడి కాలువ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు విడిచిపెట్టారు. ఇటీవల బుడగట్లపాలెం వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి నారాయణపురం కాలువ దుస్థితి, ఎచ్చెర్ల మండల రైతుల సాగునీటి ఇక్కట్లను ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తీసుకువెళ్లారు. నిధులు విడుదల కావడంతో సంతకవిటి మండలం రంగరాయపురం నుంచి భగీరథపురం కృష్ణసాగరం వరకు కాలువలో పూడికలతీత, గుర్రపు డెక్కను తొలగించారు. యుద్ధప్రాతిపదికన పొన్నాడ, రాజు గారి బ్రాంచ్ చానల్ వద్ద, కుశాలపురం, డోలపేట, ఇబ్రహీంబాద్ ఎర్రిబట్టి తదితర చోట్ల షట్టర్ల బిగింపు, మరమ్మతులు చేపట్టారు. దీంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందిలేకుండా పోయింది. దీనికి తోడు వరుణుడు కరుణించడంతో కాలువలో పుష్కలంగా నీరు ప్రవహించి శివారు గ్రామమైన రామజోగిపేట పంట పొలాలకు చేరింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది ఆశాజనకంగా పంటలు పండుతాయని నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు పేర్కొన్నారు.

సేంద్రియ విధానంతో రైతుకు లాభం



కంచిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సేంద్రియ విధానంతో రైతుకు లాభం చేకూరుతుందని సోంపేట వ్యవసాయశాఖ ఏడీ భవానీ శంకర్ అన్నారు. బూరగాం, గోకర్ణపురం గ్రామాల్లో గ్రామవ్యవసాయ సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించాలన్నారు. బూరగాంలో సేంద్రియ పద్ధతిలో ఘన, ద్రవ జీవామృతం తయారీని రైతులకు తెలియజేశారు. ఏవోలు బొర్ర నర్సింహమూర్తి, కొంకేన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

← ద్రవ, ఘన జీవామృతం తయారీని ఏడీఏ భవానీశంకర్

టీడీవలసలో ప్రత్యేక వైద్య బృందం పర్యటన

- రక్త నమూనాల సేకరణ



రోగులతో మాట్లాడుతున్న వైద్య బృందం

జి.సిగడాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): టీడీవలసలో గ్రామస్థులకు జ్వరాలు, కీళ్ల నొప్పులు, వాపులు తదితర రోగాలు తగ్గకపోవడంతో శనివారం జిల్లా కేంద్రం నుంచి ఆర్ఆర్‌టీ ప్రత్యేక వైద్య బృందం పర్యటించి వ్యాధులపై ఆరా తీసింది. ఇంటింటికీ వెళ్లి రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. వీటిని జిలాల కేంద్ర ఆసుపత్రిలో పరీక్షల నిమిత్తం తరలిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. జిల్లా ప్రత్యేక వైద్య బృంద సభ్యులు కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మనోజ్, మైక్రో బయాలజీ బి.రాధిక, జనరల్ ఫిజీషియన్ పునిత్ రాహుల్, మెడిసిన్ విభాగం నుంచి రణధీర్‌రెడ్డి, జిల్లా మలేరియా నివారణ అధికారి సత్య నారాయణ రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వర్షాలు పడుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అవసరమైన రోగులకు మందులు అందజేశారు. రోగాలు తగ్గుముఖం పట్టేవరకు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహి స్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.యశ్వంత్, సుమబిందు తెలిపారు. దోమలు బెడద, పారిశుధ్య లోపం వల్ల రోగాలు ప్రబలినట్లు వైద్య బృంద ప్రతినిధులు తెలిపారు. వారి వెంట ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ తదితరులున్నారు.

ఒడిశా విద్యార్థులకు ఫార్మా హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలు జెమ్స్ కళాశాలలో ఒడిశా విద్యార్థినీ విద్యార్థులకు ఫార్మా హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులను ఎన్‌యూఏ ఒడిశా ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా అక్కడి ప్రభుత్వ సహకారంతో చేపట్టామన్నారు. ప్లస్ త్రీ పాసైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టు, ప్లస్ త్రీ పాసైన/ఫెయిలైన అభ్యర్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయసు కలిగినవారు అర్హులన్నారు. శిక్షణ పొందే విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్ అందించనున్నామన్నారు. కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశంలోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రు ల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఇతర వివరాలకు 76809 45357, 7995013422, 8331118019 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. అలాగే జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కార్యాలయంలోసమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

పీ-4 అమలుపై శిక్షణ

లావేరు, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేని సక్రమంగా నిర్వహించేందుకు గాను శనివారం బెజ్జిపురం యూత్‌క్లబ్ కార్యాలయంలో క్లబ్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో ఎలా సర్వే చేపట్టేది చర్చించారు. ఎంపిక చేసిన బంగారు కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందజేయడం, ఆర్థిక సమస్యలను నివారించే దిశగా సంస్థ కృషి చేస్తుందని యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఇజ్జాడ అప్పారావు, గంట్యాడ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నేతలకు అరుదైన గౌరవం

ఆమదాలవలస, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉత్తరాంధ్ర నేతలకు అరుదైన గౌరవం లభించిందని మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. శనివారం పట్టణ టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలన్న దృక్పథంతో చంద్రబాబు ముందుంటారన్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజును గోవా గవర్నర్‌గా, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర మంత్రిగా, కలిశెట్టి అప్పల నాయుడును విజయనగరం ఎంపీగా అవకాశం కల్పించడం టీడీపీకే సాధ్య మన్నారు.

ఎరువుల పంపిణీ

గార రూరల్, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): కొర్ని గ్రామ సచివాలయంలో శనివారం జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి ఆధ్వర్యంలో ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి, ఏవో దుంపల పద్మావతి, ఆర్ఐ రాజేంద్ర, ఏఈవో దుర్గా ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త.. పట్టించుకోని యంత్రాంగం

- చెత్త సంపద కేంద్రం ఉన్నా నిరుపయోగమే..
- రాకపోకలకు ప్రజలు ఇబ్బంది

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట కూడలిలోని వ్యాపారులు, హోటళ్లు, చికెన్ సెంటర్లు, కల్యాణ మండపాల నిర్వాహకులు ప్రతీ రోజూ చెత్తను సమీప ప్రాంతంలోని రోడ్డు పక్కనే పారబోస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో అడ్డూ అదుపూ లేకుండా చెత్తను తెచ్చి గుంజుమెట్ట వద్ద పారబోసి చేతులు దులుపుకుంటున్నారు. శ్రీముఖలింగం వెళ్లే రోడ్డుకు ఉత్తర దిశ ప్రాంతం చల్లవానిపేట పంచాయతీ, దక్షిణ దిశ ప్రాంతం లింగాలవలస పంచాయతీ పరిధిలోకి వస్తాయి. చల్లవానిపేట చెత్త నుంచి సంపద కేంద్రం శ్రీముఖలింగం రోడ్డుకు ఉత్తర దిశలో ఉండగా.. దానికి ఎదురుగా రోడ్డుకి దక్షిణ దిశలో లింగాలవలస పంచాయతీ పరిధిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి సంపద కేంద్రానికి ఎదురుగా రోడ్డుపక్కనే చెత్తను పారబోసి అపరిశుభ్రం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు పక్కనే పారబోసిన చెత్త కుప్పలు వర్షానికి తడిసి దుర్వాసన వెదజల్లుతుందని అటుగా వెళ్లేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో చెత్త వేయకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఎదురుగానే పారబోస్తున్న వ్యర్థాలు

రూ.లక్షలు వెచ్చించినా..

చెత్త నుంచి సంపద తయారీకి ప్రతీ పంచాయతీలోను లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామానికి దూరంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. వీటిని వినియోగంలోకి తేవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. దీంతో నిర్మించిన కేంద్రాలు వృథాగా పడి ఉన్నాయి. గ్రామాల్లో మాత్రం పారిశుధ్యం పనులు చేపట్టి పరిశుభ్రత పాటించాలని ర్యాలీలు తీయడమే తప్పా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు. దీంతో పలు పంచాయతీల్లో సేకరిస్తున్న చెత్తను ఎక్కడబడితే అక్కడే పడేస్తున్నారు.

నోటీసులు జారీ చేస్తాం

గుంజుమెట్ట వద్ద శ్రీముఖలింగం వెళ్లే రోడ్డు పక్కన చెత్త పారబోస్తున్నవారికి నోటీసులు జారీ చేస్తాం. గుంజుమెట్ట వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నా చల్లవానిపేట కూడలిలో గల వ్యాపారులు ప్రతీ రోజూ చెత్త తెచ్చి పారబోస్తున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

- ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ

అభివృద్ధి దిశగా అడుగులు


ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా చంద్రబాబు పరిపాలనలో గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. గులుమూరు గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, టీడీపీ నాయకులు కె.అప్పలరాజు, ఎస్.గోవింద, టి.అప్పన్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- జలుమూరు (సారవకోట) జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ఇంటింటా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి, బుడితి, చీడిపూడి గ్రామాల్లో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించి, పథకాలపై ఇంటింటా వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, బోర తాతయ్య, ఎస్.అప్పలనాయుడు, పిట్ట సింహాచలం, సోల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్‌సేవలు అందించాలి: గౌతు శిరీష


సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు కోతలులేని మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శనివారం మధ్యాహ్నం స్థానిక టిట్కో గృహ సముదాయం వద్ద రూ.4.95 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వినియోగదారులపై విపరీతమైన చార్జీలు పెంచారని, తమ ప్రభుత్వం ప్రజల మెచ్చేలా పాలన సాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి


ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కమిటీ అధ్యక్షుడిగా తర్ర బలరాం, ఉపాధ్యక్షుడిగా డొక్క వెంకటరమణ పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఏడీ రవికిరణ్, కార్యదర్శి శారద, టీడీపీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో విలియమ్స్

హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని టెక్కలి డిప్యూటీ డీఈవో విలియమ్స్ అన్నారు. శనివారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అములు, తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. ఎంఈవో కె.రాంబాబు, హెచ్‌ఎం టి.కేశవరావు ఉన్నారు.

అక్రమంగా రోడ్డు వేసినవారిపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న గిరిజనులు, సంఘ నాయకులు

హరిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూముల్లో అక్రమంగా రోడ్డు వేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఆదివాసీ వికాస పరిషత్తు మండల అధ్యక్షుడు సవర జగన్ డిమాండ్ చేశారు. మందస మండలం కొంకడాపుట్టి పంచాయతీ కిల్లోయి కొత్తవీధి గ్రామానికి చెందిన సుమారు పదిమంది గిరిజనుల భూముల్లో కనీసం ఎటువంటి సమాచారం లేకుండా యంత్రాల సాయంతో రోడ్డు నిర్మాణం చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని శనివారం గిరిజన సంఘ నాయకులు పరిశీలించి మాట్లాడారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సవర సోములయ్య, డొంబురు, రామారావు, కిరణ్, విజయ్, మోహనరావు, క్రిష్ణారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే బీసీల అభివృద్ధి


మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు

టెక్కలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు కులగణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షనీయమని, కూటమి ప్రభుత్వం వల్లే బీసీల అభివృద్ధి జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వనమాలి శ్రీనివాసరావు అన్నారు. శనివారం టెక్కలిలో సంఘ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి అన్ని కులాలను కలుపుకొని కమిటీలు వేసి బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత విస్తరింపజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడిగా కిల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా సనపల బాలకృష్ణ, శ్రీరామ్, మహేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా టి.సునీత, టెక్కలి అసెంబ్లీ సోషల్‌మీడియా కన్వీనర్‌గా కె.ఆదినారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా ఎస్.హరిని నియమించినట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి పరామర్శ

పలాస రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-03లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేసిన జాబు బాబూరావు ఇటీవల మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని అదే విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు.. ఒడిశాలోని పాత్రపురం గ్రామానికి వెళ్లి ఉపాధ్యాయుడి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో కిక్కర ఢిల్లీరావు, మద్దిల తిరుపతిరావు, బైనపల్లి కేశవరావు, మద్దిల కైలాస్, చిరంజీవి, సాంబమూర్తి, దీప, ఈశ్వరరావు ఉన్నారు.

లారీ ఢీకొని కార్మికుడి దుర్మరణం

లావేరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రావివలస వద్ద హైవేపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రణస్థలం మండలం కోటపాలెం గ్రామానికి చెందిన కోరాడ నర్సింహులు(34) నడుచు కుంటూ స్వగ్రామం వెళుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న నర్సింహులు శుక్రవారం ఉదయం పనుల కోసం రావివలస వెళ్లి రాత్రి వరకు రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. చివరికి రోడ్డు ప్రమాదంలో నర్సింహులు మృతి చెందినట్టు పోలీసుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. నర్సింహులకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నర్సింహులు తండ్రి సూరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ ఎం.విజయానంద్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాకర్‌సాహెచ్‌పేటకు చెందిన గుజ్జల రామయ్య (51) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామయ్య వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన ఇంటి మేడ మెట్లు దిగుతూ జారి పడిపోయాడు. నగరంలోని ఓ వస్త్రదుకాణంలో పనిచేస్తున్న రామయ్య భార్యకు స్థానికులు సమాచారమిచ్చింది. వెంటనే ఆమె వచ్చి దగ్గరలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని వెళ్లి చికిత్స అందించి ఇంటికి తీసుకొచ్చింది. అనంతరం రామయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య హేమ ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం టూ టౌన్ ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

21 పశువులు పట్టివేత

కోటబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సుబ్బారావుపేట జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 21 పశువులను పట్టుకొని వారి పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీలో పశువులు తరలిస్తున్నారని సమాచారంతో దాడి చేశామని, 16 గెదేలు, ఐదు దూడలు ఉన్నాయన్నారు. వాటిని సింహాచలం గోశాలకు తరలించామని తెలిపారు.

సారా తరలిస్తూ నలుగురి అరెస్టు

కంచిలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 365 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంచిలి మండలం జక్కర రైల్వేగేటు సమీపంలో శనివారం కారులో అక్రమంగా తరలిస్తున్న 12 పాలిథిన్ కవర్లలో సారా, గోనె సంచిలో ఉన్న 1,250 సారా ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నారు. సారా తరలిస్తున్న సాలిన పుట్టుగకి చెందిన సాలిన సూర్యనారాయణ, కత్తివరానికి చెందిన మద్దిల ప్రసాద్, పులకపుట్టుగకి చెందిన పులక కూర్మారావు, ఒడిశాకు చెందిన లోకనాథంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఆమదాలవలస, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బొడ్డేపల్లిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ సీపాన కాంతారావు తెలిపారు. పక్కా సమాచారం మేరకు శనివారం సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వారి నుంచి రూ.8,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

- బూర్జ జూలై 26(ఆంధ్రజ్యోతి): ఓవీపేటలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి రూ.7,720 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కాశీబుగ్గ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఎటువంటి భారం వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారం మోపడం సరికాదని, విద్యుత్ సర్దుబాటు చార్జీలు తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కాశీబుగ్గలో ఆయా పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యాదర్శి చాపర వెంకటరమణ, సీపీ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సీపీఎం నాయకులు గణపతి మాట్లాడుతూ.. పేదలపై విద్యుత్ భారాలను మోపడం సరికాదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయమని చెప్పిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయో ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట చెప్పడం సరికాదని, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలకు మోసగించవద్దన్నారు. వచ్చే నెల 5న మండల కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మాధవరావు, రామారావు, కుసుమ, బాలకృష్ణ, రవి, వీరస్వామి, అప్పన్న, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారం వేయమని చెప్పి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూప్ అప్ చార్జీలతో ప్రజలు నడ్డి విరుస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు అన్నారు. శనివారం నరసన్నపేటలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాన్యులకు అందుబాటులో విద్యుత్ చార్జీలు ఉండాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఉత్తరాంధ్ర నేతలకు గౌరవం

పలాస, జూలై 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలోనే ఉత్తరాంధ్ర నేతలకు అత్యున్నతమైన గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవా గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అశోక్ గజపతిరాజుకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడంతో పాటు నాయకులను కూడా అత్యున్నతమైన స్థానాల్లో కూర్చోబెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వెనుకబడిన జిల్లాల నుంచి వచ్చిన అశోక్‌గజపతిరాజును గవర్నర్ చేయడం, ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్రమంత్రి పదవి ఇవ్వడం, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేయడం మచ్చుతునకలన్నారు.

సక్రమంగా ఎరువులు పంపిణీ చేయాలి


ఎల్‌ఎన్ పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సక్రమంగా ఎరువు లను పంపిణీ చేయాలని కొత్తూరు సబ్‌డివిజన్ అగ్రికల్చర్ ఏడీఏ బి.రాజగోపాల్ తెలిపారు. కరకవలస రైతుసేవా కేంద్రంలో శనివారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఏవో కె.సింహాచలం, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

- హిరమండలం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారి సంధ్య చెప్పారు. శనివారం అంబావల్లి గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు తప్పవన్నారు. తహసీల్దారు హనుమంతురావు తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి

నరసన్నపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఓటర్లు జాబితాలను పారదర్శకంగా ఉండేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజవర్గ ఈఆర్‌వో జయదేవి సూచించారు. శనివారం వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ శరత్‌కుమార్, టీడీపీ, వైసీపీ, జనసేన, సీపీఐ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి విద్యార్థిని ప్రతిభ



హర్షిణిని అభినందిస్తున్న దృశ్యం

టెక్కలి, జూలై 26(ఆంధ్రజ్యోతి): విశాఖలోని గీతం యూనివర్సిటీలో టెక్కలికి చెందిన బి.హర్షిణి బీటెక్ కంప్యూటర్ కోర్సులో చదువుతూ మూడు బంగారు పతకాలు సాధించింది. ఈ మేరకు ఎంపీ భరత్‌తో పాటు గీతం యూనివర్సిటీ వీసీ తదితరుల నుంచి శనివారం ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, సీఎస్‌ఈ బ్రాంచ్ టాపర్‌గా గోల్డ్‌మెడల్, కొల్లూరు లక్ష్మి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ప్రస్తుతం హర్షిణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కూడా ఎంపికైంది. ఈమె తల్లిదండ్రులు విజయ్‌శంకర్ గుప్త, హరిత, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిపాలనాధికారిగా బాధ్యతలు

కోటబొమ్మాళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారిగా కిల్లారి నారాయణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎచ్చెర్ల మండల పరిషత్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏవోగా పని చేసిన మంగరాణి గతనెల 30న ఉద్యోగ విరామణ పొందారు. నారాయణరావుకు పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

హరిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం పరామర్శించారు. మఖరజోలలో రిటైర్డు ప్రిన్సిపాల్ మజ్జి పున్నయ్య తల్లి లక్ష్మీదేవి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని, బైరిసారంగపురంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రవికృష్ణ తండ్రి మృతి చెందడంతో ఆయన కుటంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు బావన దుర్యోధన, బమ్మిడి కర్రయ్య, బైరిశెట్టి గున్నయ్య, వాయిలపెల్లి మాధవరావు, నవీన్, సాలిన మాధవరావు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

నందిగాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఇతర నిధులతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ నారాయణరావు అన్నారు. శనివారం చిన్నలవునిపల్లి, పెద్దలవునిపల్లి, బెజ్జిపల్లి, లఖిదాసుపురం గ్రామాల్లో చేపట్టిన పనుల్ని పరిశీలించారు. చిన్నలవునిపల్లి, లఖిదాసుపురంల్లో సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించారు. పెద్దలవునిపల్లి, బెజ్జిపల్లిలో అసంపూర్తిగా ఉన్న సచివాలయాల భవనాలను పరిశీలించి వాటి ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ సత్యనారాయణ, మండల ఇంజనీరింగ్ అధికారి పి.సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

పలాసరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. శనివారం ఆయన వివిధ ఎరువుల దుకాణాలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఏవో పోలారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- నందిగాం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని తహసీల్దార్ పెద్దింటి సోమేశ్వరరావును బీజేపీ నాయకులు హనుమంతు ఉదయభాస్కర్ కోరారు. శనివారం ఆయన్ను కలిసి ఎరువులు సరఫరా అవసరాన్ని వివరిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్‌పై అవగాహన కల్పించాలి

జలుమూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఆన్‌లైన్ పద్ధతిపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని వెలుగు ప్రత్యేకాధికారి శ్రీగౌరి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సీఎఫ్‌లు, సీసీల సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇక నుంచి మహిళా సంఘాలకు అందించే రుణాలు డిజిటల్ ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతాయన్నారు. దీనివలన ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ఉంటాయన్నారు. సంఘాలకు అందించే బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలు ఆన్‌లైన్ చెల్లింపులు ద్వారా లావాదేవీలు జరుగుతాయన్నారు. మండలంలో 1,576 స్వయంశక్తి సంఘాలు ఉండగా ఇప్పటి వరకు 1,495 సంఘాలు ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. మిగతా సంఘాలు కూడా నెలాఖరుకు ఆన్‌లైన్ చేసి సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీపీఎం నాగలక్ష్మి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు బగ్గు భవాని, కార్యదర్శి బైరి ఇందిర, సీసీలు బుడ్డెమ్మ, పలువురు సీ.ఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్



కాశీబుగ్గ: పలాస కాశీబుగ్గలో ర్యాలీ చేస్తున్న మాజీ సైనికులు



రణస్థలం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

కార్గిల్ విజయ్ దివస్ జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. పలువురు మాజీ సైనికులు మాట్లాడుతూ.. మాతృభూమి కోసం ఎంతోమంది జవాన్లు చేసిన త్యాగం ప్రతీ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం కల్చరల్: కార్గిల్ పార్కులో మాజీ సైనికులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



ఇచ్ఛాపురం: అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు